
ఆదివారం
వార్త
26 నవంబరు, 2023
అడుగడుగునా
అగ్ని కీలలు

విక్టరీ వెంకటేష్ కథానాయకుడుగా, శ్రద్ధాశ్రీనాథ్ హీరోయిన్‌గా నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై వెంకట్ బోయినపల్లి నిర్మాతగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ సినిమా 'సైంధవ్'. ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్స్, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. సంతోష్ నారాయణన్ సంగీతం అందిస్తున్న 'సైంధవ్' సినిమా జనవరి 13న విడుదల కానుంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ ఎంత వరకు విజయం అందుకుంటారో చూడాలి మరి.



# 'సైంధవ్' జనవరి 13న విడుదల!

## తారాతీరం



# చైతన్యకృష్ణ రీ ఎంట్రీ

**నందమూరి** చైతన్యకృష్ణ హీరోగా 'బ్రీత్' సినిమా రూపొందింది. గతంలోనే ఎంట్రీ ఇచ్చిన చైతన్యకృష్ణ, కొంత గ్యాప్ తరువాత చేస్తున్న సినిమా ఇది. నందమూర్తి జయకృష్ణ నిర్మించిన ఈ సినిమాకి వంశీకృష్ణ ఆకెళ్ల దర్శకత్వం వహించాడు. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్లో రూపొందించిన ఈ సినిమాకి మార్క్ కె.రాబిన్ సంగీతం సమకూర్చాడు. గతంలో వంశీకృష్ణ ఆకెళ్ల 'ది ట్రిప్', 'రక్షా' అనే సినిమాలను తెరకెక్కించాడు. ఆయన రూపొందించిన 'బ్రీత్' సినిమా ఇప్పుడు విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా నుంచి చైతన్యకృష్ణ ఇక వరుస సినిమాలు చేస్తాడేమో మరి..

ఆదివారం వార్త

26 నవంబరు, 2023

## మంచి ముత్యాలు

మగువ, మధువు తరచుగా రాజ్యపతనానికి కారకులయ్యాయి. అయితే, పుస్తకాల మూలంగా చెడిపోయిన వారినెవరినైనా చూచారా?

- చైనా కథ నుండి

## విషయ విశేషం

ఓ ఆటోడ్రైవర్ సక్సెస్... 4

'సంఘీ'భావం....5

డీప్‌ఫేక్ విడియోలతో పొంచి ఉన్న ముప్పు

కవర్ స్టోరీ..6

అడుగడుగునా

అగ్ని కీలలు

అలుపెరుగని నటుడు

చంద్రమోహన్...10

ఈవారం కవిత్వం..12

మరలా వస్తావా!!

మినరల్ మాయతో ప్ర'జల' కష్టాలు!....14

కథ.. 20

సంకల్ప బలం

సాహిత్యం..23

దాశరథి 'అగ్నిధార'

అద్భుత బౌద్ధ ఆలయాలు...25

వృధానీరు ఎటువైపు?...29

ఇంకా..

పుస్తక సమీక్ష


మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## వెలిగే పరదాలు



ఇంటి అలంకరణ కోసం కొనే ప్రతి వస్తువూ వీలైనంత ప్రత్యేకంగా వైవిధ్యంగా ఉండాలని కోరుకునేవారి సంఖ్య ఈ రోజుల్లో ఎక్కువ. అలాంటి వారి కోసమే ఇప్పుడు కొత్తలుక్‌తో కనికట్టు చేసే పరదాలు వస్తున్నాయి. అవే ఈ 'లైట్ బ్లాకింగ్ గ్లోఇన్ ద డార్క్ కర్టెన్స్'. ఈ పరదాలపైన కనిపించే నక్షత్రాలూ, జంతువులూ తదితర బొమ్మల డిజైన్లను చీకట్లో వెలిగే విధంగా ప్రత్యేకరంగుతో ప్రింటు చేయడం వల్ల లైట్లు ఆర్పినప్పుడు ఆ డిజైన్ల వెలుగుతున్నట్లుగా కనిపిస్తాయన్నమాట. పాలియస్టర్, శాటిన్ వంటి మెటిరియల్‌లో వస్తున్న ఈ కర్టెన్లపైన కాసేపు ఎండ లేదా వెలుతురు పడేలా చేస్తే చీకట్లో వెలుగుతాయనీ అప్పుడప్పుడూ వాటిని వాషింగ్‌మెషీన్‌లోనే చల్లనినీటితో ఉతికితే ఎక్కువకాలం మన్నుతాయనీ చెబుతున్నారు తయారీదారులు.

### నిద్రపట్టడం లేదా?



వేళకు నిద్రపోయేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించక కొందరు తెగ ఇబ్బందిపడుతుంటారు. అలాంటివారిని దృష్టిలో పెట్టుకునే ఈ 'డోడో' అనే చిన్న పరికరాన్ని తీసుకొచ్చారు నిపుణులు. బల్లపైన పెట్టుకునే లైటు తరహాలో కనిపించే ఈ పరికరం బ్యాటరీ సాయంతో పనిచేస్తుంది. దీన్ని బల్లపైన పెట్టి నొక్కినట్లుగా పోయి శరీరం విశ్రాంతి పొంది హాయిగా నిద్రపడుతుందట. ఎనిమిది లేదా ఇరవై నిమిషాలు వెలిగి ఆరేలా ఈ లైటును సెట్ చేసుకుంటే ఆ తరువాత దానంతట అదే ఆరిపోతుంది.

### గ్లూ పెన్నులు

స్కూలు ప్రాజెక్టుల్లో భాగంగా చేసే బొమ్మల కోసం కావొచ్చు. కాగితాలను అతికించుకోవడం కోసం కావచ్చు...గమ్ ఉండాల్సిందే. అలాగని పిల్లల చేతికి గమ్ సీసా ఇచ్చామా..సగం కింద పారబోస్తారు లేదా గమ్ అంటించిన చేతుల్ని తమ డ్రెస్‌లకు తుడుచుకుంటారు. తరువాత ఆ గమ్‌ను తొలగించడం మరో పని కదూ.. అందుకే ఈసారి పిల్లలు గమ్ కావాలని అడిగినప్పుడు ఈ గ్లూ పెన్ను ఇస్తే సరి. చూడటానికి ఇది పెన్నులానే ఉన్నా దీనిలోపల



గమ్ ఉంటుంది. గమ్‌ను వాడాలనుకున్నప్పుడు ఆకగితాలపై ఈ పెన్ను తో గీతగీసినా లేదా చుక్కలు పెట్టినా సరిపోతుంది.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ఓ ఆటోడ్రైవర్ సక్సెస్




పెరుగుతున్న పెట్రోల్, డిజీల్, గ్యాస్ ధరలతో ఆటోలు నడపడం చాలా కష్టంగా మారుతున్నది. వచ్చిన డబ్బు ఇంధనం ఖర్చులకు పోతే, అరకొర సంపాదనతో జీవితాలను నెట్టుకొస్తున్న ఆటోడ్రైవర్ల గురించి మనకు తెలిసిందే! అయితే చెన్నైకి చెందిన అన్నాదురై జీవితం ఇందుకు విరుద్ధం. ఇతని ఆదాయం నెలకు సుమారు రెండు లక్షలు అంటే ఆశ్చర్యమేస్తుంది. అతని క్రియేటివిటీకి మరో రెండుమూడు లక్షలు అందుకుంటాడు. అదెలాగంటె తన ఆటోలో ప్రయాణించేవారికి పలు సౌకర్యాలు అందిస్తూ రకరకాల ప్రయోగాలు చేస్తుంటాడు. ఎక్కితే అన్నాదురై ఆటోనే ఎక్కాలనుకునేలా ప్రయాణికుల మనసుల్లో చెరిగిపోని ముద్ర వేసుకున్న అతడు 2013లో టెడ్ఎక్స్ లో మాట్లాడటంతో అందరి దృష్టిలో పడ్డాడు. అప్పట్నుంచీ అన్నాదురైని ఐఐటీ, ఐఐఎం, ఐఎస్‌బీ వంటి విద్యాసంస్థలు ఆహ్వానించి తమ విద్యార్థులకు వ్యాపార పాఠాలు చెప్పమంటున్నాయి. వొడాఫోన్, టయోటా, రాయల్ ఎన్‌ఫీల్డ్, హ్యుందాయ్, ఇన్ఫోసిస్, సీరమ్ ఇనిస్టిట్యూట్, ఫాక్స్ కాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ తదితర సంస్థలు తమ ఉద్యోగులకు అతని జీవితపాఠాన్ని బోధించమంటున్నాయి. కాలేజీలూ, స్కూళ్లు మోటివేషన్ స్పీకర్‌గానూ పిలుస్తున్నాయి. అన్నాదురై ప్రతిభకు మెచ్చుకోలుగా ఆయాసంస్థలు ఆర్థికంగా సాయపడుతున్నాయంటే దాని వెనుక అతని కృషి ఎంతో ఉంది.




అన్నాదురైది చెన్నైలోని ఓ నిరుపేద కుటుంబం. బాగా చదువుకోవాలనుకున్నాడు గానీ, ఆర్థిక సమస్యల వల్ల ఇంటర్ మధ్యలోనే చదువు మానేసి ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. కానీ, ఎక్కడా అతనికి సరైన అవకాశాలు రాలేదు. చివరికి 2009లో డ్రైవింగ్ నేర్చుకుని ఆటో నడపడం మొదలుపెట్టాడు. మొదట్లో రోజంతా కష్టపడ్డా గిట్టుబాటు అయ్యేది కాదు. ఒకరోజు ఓ పెద్దాయన అన్నాదురై దగ్గరకొచ్చి 'బాబూ ఫోన్ ఇస్తావా.. మాట్లాడి ఇస్తా'నని అడిగాడు. 'ఆటో ఎక్కితే ఇస్తా'ననే షరతుపెట్టి మరీ ఇచ్చాడు. ఆ పెద్దాయనా ఫోన్ మాట్లాడాక ఆటో ఎక్కాడు. ఆరోజు అతని మనసులో ఏవో ఆలోచనలు వచ్చాయి. ప్రయాణికుల కోసం ఏదైనా చేస్తే మనల్నే వెతు క్కుంటూ వస్తారనుకున్నాడు. ఆరోజు నుంచీ ప్యాసింజర్లతో మాట్లాడుతూ అవసరాలు గమనించడం మొదలుపెట్టాడు. ఐటీ ఉద్యోగులు ల్యాప్‌టాప్ తెరిస్తే ఇంటర్నెట్ కనెక్ట్ అయ్యేది కాదు. మరికొందరు పొద్దునే సరిగా తినకుండా వచ్చేవారు. విదేశీయులు ఎక్కితే బోర్‌గా ఫీలయ్యేవారట. అందుకే మినీఫ్రిజ్‌లో పళ్లూ, నీళ్లూ, కూల్‌డ్రింక్స్, కొబ్బరి నీళ్లూ, మజ్జిగా మరో అరలో చిరుతిళ్లూ, ఫస్ట్‌ఎయిడ్‌కిట్, గొడుగులూ, వైఫై, ల్యాప్‌టాప్, ఐపాడ్, ట్యాబ్, టీవీ 35 రకాల మ్యాగజైన్లు, న్యూస్‌పేపర్లు, శానిటైజర్, టిష్యూలు, డస్ట్‌బిన్ తదితర సౌకర్యాలన్నీ ఆటోలో ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఉచితంగా ఇవ్వడం ప్రారంభించాడు.

### వ్యతిరేకించిన తల్లిదండ్రులు

అన్నాదురై ఏర్పాట్లు చూసిన తల్లిదండ్రులు 'మనకేం మిగులుతుందని'ని బాధపడ్డారు. 'పెట్రోలుకైనా డబ్బులొస్తాయా' అని బంధువులు వెటకారంగా మాట్లాడేవారు. అవన్నీ పట్టించుకోకుండా అన్నాదురై మొదట్లో పజిల్స్ నింపమని, జీకే ప్రశ్నలకు సమాధానాలు టిక్ చేయ మనీ ఆటోలో పేపర్లు ఉంచేవాడు. లక్కీ డీప్ పెట్టి పదిరోజులకోసారి డ్రా తీసేవాడు. వీటన్నింటిలో విజేతలైనవారికి బహుమతులు ఇచ్చేవాడు. కొందరు ప్రయాణీకులు దిగాక ఇవ్వాల్సిన దానికంటే అదనంగా డబ్బులు ఇస్తుంటారు. అభినందనగా మరికొందరు సెల్ఫీలు దిగి పరోక్షంగా ప్రచారం చేసి పెడుతున్నారు. అంతేకాదు నెలకు 20 ట్రిప్పులు తన ఆటోలో ప్రయాణిస్తే ఆ తరువాత వారికి 250 రూపాయల మీటర్ రేట్ వరకూ ఫ్రీ సర్వీసు ఇస్తుంటాడు. 40-50 ట్రిప్పులు చేసిన వారికి ఆ తరువాత 500-1000 రూపాయల మీటర్ రేటు వరకూ సర్వీసు ఉంటుంది. ప్యాసింజర్ సేవల విషయానికొస్తే టీచర్లూ, వైద్యుల వద్ద డబ్బులు తీసుకోడు. రెండేళ్ల నుంచి టీసీఎస్, ఇన్ఫోసిస్, ఐబీఎం, కాగ్నిజెంట్, హెచ్‌సీఎల్ వంటి సంస్థల వ్యవస్థాపకుల పుట్టినరోజుల నాడు ఆయా సంస్థల ఉద్యోగు లకు ఆరోజు ఉచితంగా సర్వీస్ అందిస్తుంటాడు. అలా రకరకాల ఆఫర్లూ, సౌకర్యాలతో వినూత్నంగా ఆలోచించే అన్నాదురై వీటన్నింటికోసం నెలకు దాదాపు ఇరవైవేలు ఖర్చుపెడుతున్నాడు. ఎప్పటికైనా సొంతంగా ఓ క్యాబ్ సర్వీసెస్ నడపాలనుకుంటున్న అతను తమిళం, హిందీ, ఇంగ్లిష్ అనర్గళంగా మాట్లాడుతూ ప్రయాణికులను చేరవేస్తుంటాడు.

## 'సంఘీ' భావం



# డీప్‌ఫేక్ విడియోలతో పొంచి ఉన్న ముప్పు

**కృత్రిమ** మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) వల్ల సమాజానికి కలిగే చేటు క్రమంగా బయట పడుతోంది. ముఖ్యులు, ప్రముఖుల విడియోలను డీప్ ఫేక్ దృశ్యాలు (పూర్తిస్థాయి మార్ఫింగ్) చేయడం ద్వారా సమాజాన్ని తప్పు దారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడికి సంబంధించిన డీప్‌ఫేక్ విడియో బయటకు రావడంతో ఈ అంశం చర్చనీయంగా మారింది. అదేవిధంగా దక్షిణాది సినీనటి రష్మిక మందన్నాకు సంబంధించి రెండు ఫేక్ విడియోలు బయటకు వచ్చాయి. బ్రిటీష్ ఇండియన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జారా పటేల్‌కు చెందిన విడియోను రష్మిక ముఖాన్ని కలిపి విడియోగా చిత్రీకరించారు. ఈ విడియో చూసే వారికి రష్మికయే ఈ విధంగా ప్రవర్తించదన్న అనుమానాలు వ్యక్తం అవుతాయి. కాజల్‌కు సంబంధించిన ఫేక్ వీడియో కూడా వైరల్ అయ్యింది. ఇక మోడీ దర్బా డాన్స్ చేస్తున్న విడియో వచ్చింది. వీరంతా ఇలాంటి విడియోలు వచ్చిన వెంటనే వారు మీడియా ముందుకు వచ్చి విచారాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఈ వీడియోలు కేవలం ఒక ఉదాహరణగా మాత్రమే నిలిచాయి. దీనివల్ల వ్యక్తిగత ఇమేజ్‌కు భంగం వాటిల్లింది. అంతకు మించి నష్టం కలగలేదు. అయితే భవిష్యత్తులో ప్రముఖులు, సమాజంలో గౌరవ మర్యాదలు కలిగి వారి మాటకు విలువ ఉన్న వ్యక్తుల వీడియోలు బయటకు వస్తే పరిస్థితి ఏమిటన్న ఆందోళన సర్వత్రా వ్యక్తం అవుతోంది. ఇప్పటికే అమెరికాలో ఒబామా ఫేక్ విడియోలో ట్రంప్‌ను దుర్భాషలాడినట్లు విడియో వైరల్ అయ్యింది. ఇది నిజమే అనుకున్న అక్కడి పౌరులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అది ఫేక్ విడియో అని తెలి ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి ఫేక్ వీడియోల వల్ల దేశాల మధ్య యుద్ధాలు జరిగేందుకు అవకాశం లేకపోలేదు. ఇక ఫేక్ విడియోల వల్ల కాపురాలు కూలిపోయే పరిస్థితి కూడా ఉంది. గతంలో కేవలం ఫోటోను మార్ఫింగ్ చేసే వారు. ముఖ్యంగా సినీతారలు, ప్రముఖులైన మహిళల మార్ఫింగ్ సమస్యగా ఉండేది. అయితే దీనివల్ల అంతగా నష్టం కలిగే అవకాశం లేదు. ఏదైనా జాతీయ నాయకుడు మాట్లాడని మాటలను ఈ ఫేక్ విడియో ద్వారా విడుదల చేస్తే దానికి సంబంధించిన పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. అది ఫేక్ వీడియో అని చెప్పేలోపే కొన్ని అనర్థాలు జరిగే ప్రమాదం ఉంది. నకిలీ వీడియోలను సామాన్యులు కూడా గుర్తించే టెక్నాలజీ ఇంకా రూపొంచలేదు. దీనితో నిపుణులు వివరణ ఇస్తేనే గాని వాస్తవాలు తెలియని పరిస్థితి ఉంది. దీనిని మంచికి ఉపయోగించుకుంటే ఇబ్బంది లేదు. అయితే ప్రారంభ దశలోనే పక్కదారులు పడుతోంది. కేవలం చిన్న డీప్ ఫేక్ వీడియోనే సంచలనాలు కలిగిస్తోంది. దీనిని సంఘ విద్రోహక శక్తులు ఉపయోగించుకుంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. కృత్రిమ మేథ వల్ల కలిగే ప్రయోజనాల కంటే దుష్ప్రయోజనాలే అధికంగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే అనేక ఇంజనీరింగ్ కళాశాలలు ఆర్టిపిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులను ప్రవేశపెట్టారు. రాబోయే తరం ఈ సబ్జెక్టే అని ప్రచారం జరగడంతో కంప్యూటర్, ఎలక్ట్రానిక్ సైన్స్ పట్ల ఆసక్తి చూపించే విద్యార్థులు కృత్రిమ మేథ వైపు మొగ్గు చూపుతున్నారు. ముందుగా సినిమాల్లో ఉపయోగించేందుకు ఏఐని రూపకల్పన చేశారు. క్రమంగా అది సమాజంలో అమలులోకి వచ్చింది. అసలు విడియోకు, డీప్ ఫేక్ వీడియోకు పెద్దగా వ్యత్యాసం కనిపించడం లేదు. దీనితో అదే నిజమైన వీడియోగా భావించాల్సి వస్తోంది. ఐటి నిపుణులు ఫేక్ వీడియోను ఎలా గుర్తించాలని కొన్ని సూచనలు చేస్తున్నారు. కనురెప్పలు కదలికలు, శరీరం, తల ఒకే లయబద్ధంగా కాకుండా వైరుధ్యంగా ఉండటం, శరీరాకృతిలో స్పష్టమైన మార్పు వంటివి పరిశీలించాలని చెబుతున్నారు. ఉదాహరణకు నకిలీ కరెన్సీ నోట్లను గుర్తించేందుకు ఎన్నో సూచనలు చేసినా సామాన్యులే కాదు విద్యావంతులు కూడా అంత సులభంగా గుర్తు పట్టలేని పరిస్థితి ఉంది. అలాంటిది అత్యంత మేధానిపుణతలో రూపొందించిన డీప్ ఫేక్ విడియోలను ఎలా గుర్తించగలం. ఉదాహరణకు ఒక కుటుంబాన్ని విచ్ఛిన్నం చేయడానికి పురుషుడు కాని, మహిళ కాని వేరొకరితో శృంగారం చేసినట్లు విడియోను ఏఐ ద్వారా రూపొందించవచ్చు. ఏమాత్రం అనుమానం రాని విధంగా ఉన్న ఈ విడియోను చూసిన తరువాత సాధారణంగానే అవతలి వ్యక్తి విచక్షణ కోల్పోవడం మానవనైజం. భారతీయ ఐటి చట్టంలోని 6ఈ ద్వారా కొంతవరకు ఈ ఫేక్ వీడియోలను కట్టడి చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇలాంటి వీడియోలు చిత్రీకరించినట్లు రుజువు అయితే రెండు లక్షల రూపాయల వరకు జరిమానా మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. డిపిడిపి చట్టం 2023 ద్వారా ఒక వ్యక్తి యొక్క గోప్యత హక్కును నేరుగా ప్రభావితం చేయడం, ఆయన కదలికలను తప్పుగా చిత్రీకరించడం. దీనిని సోషల్ మీడియాలో వైరల్ చేయడం వంటివి అన్నీ నేరపూరిత చర్యలుగా పరిగణించబడతాయి. అయితే సైబర్ క్రైం మాదిరిగానే ఈ ఏఐ నేరస్తులు కూడా చట్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంది. డీప్‌ఫేక్ విడియోను సాధారణ పౌరులు కూడా కనిపెట్టగలిగే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావాలి. ఎవరికి వారు వీడియో నకిలీదని గుర్తించినప్పుడే నేరాలను, అనర్థాలను కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ఒకసారి విడియో వైరల్ అయితే అది నిజామా కాదా అని గ్రహించేలోగానే నష్టం జరిగే ప్రమాదం ఉంది. కఠినతర మైన నిబంధనలు అమలు చేస్తే కొంతవరకైనా అదుపు చేసే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# అడుగడుగునా అగ్ని కీలలు

**కవర్ స్టోరీ**
**జంధ్యాల శరత్‌బాబు**

**నిప్పు పెనుముప్పుగా మారితే? వెలుగు అంతరించి, మనిషి పెరిగి పెను నిర్లక్ష్యం తాండవిస్తే? ఆ జ్వాల తీవ్రతకు సర్వస్వమూ అంతరించిపోతుంది. ఇళ్లు మొదలు బహుళ అంతస్తుల భవనాల దాకా ఎక్కడ ఏ మూల నిప్పు రాజుకున్నా, అగ్ని ప్రమాదం దాపురించి చివరికి బూడిదే మిగులుతుంది. తెలుగునాట అనేక ప్రాంతాల్లో చాలామటుకు నేరపూరిత అలక్ష్యమే చెలరేగి సమస్తాన్నీ భస్మీపటలం చేసిన ఉదంతాలున్నాయి. జీవన భద్రత ఇంతగా నిట్టనిలువునా దహించుకు పోవడానికి మూలకారణాలేమిటి? పరిష్కార మార్గాలూ ఉన్నాయా, ఉంటే అవేమిటి? 'రక్షణా! నువ్వెక్కడ?' అని ప్రశ్నించాల్సి వస్తోంది. అంతర్జాతీయంగా చూస్తే ఎనిమిదేళ్ల క్రితం ఫిలిప్పీన్స్‌లోని పారిశ్రామిక భవనంలో ఉవ్వెత్తున లేచిన మంటలు వంద మందికి పైగా ఉసురు తీశాయి. అంతా అప్పటికప్పుడే అక్కడి కక్కడే సజీవ దహనమయ్యారు. జాతీయంగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా విపణిలో, అదే రోజున ఒడిశా రాజధాని ప్రాంతం భువనేశ్వర్ సచివాలయంలో, అలాగే తమిళనాడు రాజధాని నగరంలో ఉన్నత న్యాయస్థానం సముదాయంలో ఒక్కరోజునే అగ్నిప్రమాదాలు సంభవించాయి.**

**గతంలోకి** తొంగిచూస్తే హరియాణాలోని దబ్వాలీలో పాఠశాల వార్షికోత్సవ వేదిక అంటుకుని, ఒకటీ రెండూ మూడు కాదు... ఏకంగా 450 మంది బడిపిల్లల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అంతకుముందు ఉత్తరప్రదేశ్‌కి చెందిన మేరఠ్ వాణిజ్య ప్రదర్శనలో అగ్నిజ్వాలలు ఎగసి ఎంతో మంది బతుకుల్ని బుగ్గిపాలు చేశాయి. ఇక ప్రాంతీయంగా మొన్నటికి మొన్న విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో భారీ ప్రమాదం. అక్కడి పదుల సంఖ్యలోని పడవలకు ఎవరో కావాలని నిప్పు పెట్టారన్నది ప్రాథమిక సమాచారం! లక్షల రూపాయల విలువైన సరకు పరశురామ ప్రీతి.

## నివాసాల్లో అగ్గి

హైదరాబాద్‌లోని బజార్‌ఘాట్‌లో ఒక అపార్ట్‌మెంట్ అగ్నికీలల్లో చిక్కుకుని పది మంది నిలువునా కాలిపోవడం భయంకర సంఘటన. నాలుగు అంతస్తుల ఆ సముదాయంలో దిగువన(గ్రౌండ్ ఫ్లోర్) కారు గ్యారేజీ ఉంది. రిపేరుపని జరుగుతుండగా ఉన్నట్లుండి మంటలు లేచి పక్కనే ఉంచిన డీజిల్, రసాయనాల డ్రమ్ములు అంటుకుని అక్కడి నివాసాలు ప్రాణాంతకమయ్యాయి. ఆ ఘోరం ఇప్పటికీ పీడకలలా ఆ ప్రాంతీయులను వెంటాడుతోంది. భాగ్యనగర ప్రాంతంలో నిరుడు అతిపెద్ద అగ్నిప్రమాదాలు నాలుగు జరిగాయి. సంవత్సర ఆరంభంలోనే ఒక మాల్‌లో అగ్ని అందరినీ గడగడ వణికించింది. అటు తర్వాత కూడా పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇటువంటి సందర్భాల్లో మంత్రులు, ఉన్నతాధికారుల పరామర్శలు సర్వసాధారణం. కేసులు నమోదు చేశామంటారు, బాధిత కుటుంబాలను ఆదుకుంటామంటారు, పరిహారం మొత్తాలు ఇస్తామని హామీలూ

ఇచ్చేస్తుంటారు. ఆ ప్రకటనల, పర్యటనల హోరూ జోరూ తగ్గాక పరిస్థితులు మళ్లీ మామూలే. భారత శిక్షాస్మృతి కింద ఉన్న 285, 286 నిబంధనలు పేలుడు పదార్థాలతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గురించి వెల్లడిస్తాయి. అదే విధంగా జాతీయ స్థాయిన ఎక్స్‌ప్లోజివ్స్ యాక్ట్ అనేది ఒకటుంది. అందులోని 9వ సెక్షన్ ప్రకారం కేసు పెట్టడమూ పరిపాటి. అంతవరకే! ఎప్పుడు ఎంత మందికి శిక్షలు పడ్డాయనేది ఎక్కడా వెల్లడి కాదు మరి.



## అక్కడా ఇక్కడా అని లేదు..

అగ్నిప్రమాదాల నిరోధం, నివారణలకు కమిటీ ఏర్పాటు అన్నదీ చిదంబర రహస్యమే. ఆంధ్రప్రదేశ్‌లోగానీ, తెలంగాణలోగానీ అటువంటి కమిటీలు అసలంటూ ఉన్నాయా? ఉంటే అవి చేస్తున్న పనేమిటి? అనేదీ జవాబు దొరకని ప్రశ్నలు. నివాస భవనాలు, గోదాముల్లో వరస ప్రమాదాలు జరిగిపోతున్నా అధికార యంత్రాంగాలు నిద్రమత్తు వీడటం లేదు. కొన్ని చోట్ల నివాస గృహాల పరిసరాల్లోనే వాణిజ్య వ్యవహారాలు కొనసాగుతున్నా సంబంధిత అధికార బృందాలకు అవేమీ కనిపించవు. ఆర్తుల రోదనలు వాళ్ల చెవికి బొత్తిగా వినిపించవు. ప్రమాదాలకు ఎంతైనా ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో అనుమతులు ఎలా వస్తున్నాయో, ఎవరిస్తున్నారో ఒక పట్టాన ఎవరికీ నేటికీ అంతుపట్టదు. అంతెందుకు...



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మునుపు ఉన్నత న్యాయస్థానం ప్రధాన భవంతిలోనే ఒక చోట మంటలు రేగాయి. అదివరకు న్యాయమూర్తుల సమావేశ మందిరానికీ ఈ బెడద తప్పలేదు. అత్యంత జ్ఞాన సంపద నిండిన గ్రంథాలయ పుస్తకాలూ ఆనాడు కాలిపోయి ఆనవాళ్లు కోల్పోయాయి. అప్పటి ఆ ఘటన న్యాయవాదుల, న్యాయమూర్తుల మనసును ఎంతగానో కలచివేసింది. ఇవన్నీ కొంతమంది నేరపూరిత నిర్లక్ష్యా నికి ఆనవాళ్లు కావంటారా? మరో ప్రధానాంశం ఏమిటంటే– అగ్ని మాపక శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండానే కొన్ని ప్రాంతాల్లో భవన నిర్మాణాలు పరంపరంగా కొనసాగుతుండటాన్ని ఉన్నత న్యాయ స్థానం ఇదివరకే తప్పు పట్టింది. అంతేకాదు, పౌరుల ప్రాణరక్షణ ప్రభుత్వాల ప్రథమ, ప్రధాన బాధ్యత అని తేల్చి చెప్పింది. ఇది ఇప్పటి మాట కాదు. దశాబ్దాల నాటిది. అయినా స్థితిగతుల్లో ఎటువంటి మార్పూ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కానరాకపోవడం అన్ని విధాల విచారకరం. అగ్ని నుంచి ప్రజల భద్రతకు సంబంధించి, ప్రభుత్వాలు గుర్తెరిగి వ్యవహరించాలన్నది నిస్సందేహం.

## ప్రమాణాల మాటేమిటి?

ఏ విధమైన భవనాలకైనా(నివాసాలు, వాణిజ్య సంబంధలు) నియమ నిబంధనలంటూ కొన్ని ఉన్నాయి. మొత్తం జాతీయ స్థాయిలోనే 'బిల్డింగ్ కోడ్' అంటూ ఒకటుంది. ఏ భవంతి ముందైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే, అక్కడ వాటి చుట్టూ కంచెలు నిర్మించి తీరాలన్నది ఓ నియమం. ఆ కంచెలు అత్యంత దృఢంగా, రక్షక కవచాలుగా ఉండాలన్నదీ సారాంశం. అంతేకాకుండా, ఎటువంటి విపత్తు ముంచుకొచ్చినా తమ ప్రాణాలను తాము రక్షించుకునేలా నివాస ప్రాంతాల వారికి ముందస్తు శిక్షణ ఇవ్వాలనీ నిబంధన ఉంది. భవనాల నిర్మాణాలు/ నిర్వహణాలు/ పర్యవేక్షణలు సుశిక్షితుల ద్వారా కొనసాగాలని కూడా నియమావళి ప్రస్ఫుటం చేస్తోంది. ఏది ఏమైనా భద్రతా ప్రమాణాలను విస్మరించుకోకూడదని, విస్మరించడమన్నది కఠినాతి కఠిన శిక్షార్హమని న్యాయస్థానం ఏనాడో స్పష్టీకరించింది. ఎక్కడైనా ఎప్పుడైనా ప్రమాదం జరిగితే, ఏ నెంబరుకు ఫోన్ చేసి చెప్పాలో ఎంత మందికి తెలుసు? తమ ప్రదేశంలో ఎక్కడ అగ్నిమాపక కేంద్రం ఉందన్న అవగాహన పల్లెల్లో ఆ మాటకొస్తే పట్టణాల్లోనూ ఎందరికి ఉంటుంది. సమయానికి గుర్తుకు రాని పరిస్థితి ఎంత వ్యథాభరితం? అలా కాకుండా ప్రమాద సమాచారాన్ని సంబంధిత శాఖకు తక్షణమే చేరవేసే 'యాప్' అనేది ఏమైనా ఉంటుందా అంటే ఉంది. ఆ మేరకు ఫోన్ యాప్‌ను దశాబ్దాలనాడే గోవాలో రూపొందించారు. అటువంటి ప్రత్యేక ఏర్పాట్లు మన దేశంలోనే మొదటిదనాలి. ఎంతో వేగవంత విధానం అది. దాన్ని ఇతర అన్ని ప్రాంతాలకూ విస్తరించే కనీస ప్రయత్నమైనా జరిగిందా అంటే... ప్రశ్నార్థకం. పైగా నిప్పును ఆర్పే దళం పని పరిస్థితుల్లో ఏమైనా మార్పులొచ్చాయా? అన్నదీ సందేహమే. ఆ విభాగ ఆధునీకరణ పరంగా కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్(కాగ్) నుంచి నివేదిక సైతం ప్రభుత్వాలకు అంది దశాబ్దాలు గడిచిపోయాయి. బుట్టదాఖలవడం మామూలే!

## క్రియాశీలతే ప్రశ్నార్థకం!

ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అగ్నిమాపక కేంద్రాల కొరత సరేసరి. ఆ భవన నిర్మాణాలు అంతంత మాత్రం. అక్కడ యంత్ర సదుపాయాలూ పరిమితం. సిబ్బందికి కటకట ఎప్పుడూ ఉండేదే. వాహనాలు పాత కాలం నాటివి. మొరాయించే సందర్భాలు లెక్కలేనన్ని. సిబ్బందికి అత్యాధునాతన పరికరాల వినియోగం మీద అవగాహన తక్కువ. సమగ్ర స్థాయిన శిక్షణ ఇచ్చిన దాఖలాలైనా లేవు. ఈ సమస్యల తీవ్రతను 'కాగ్' ఏనాడో వెలుగులోకి తెచ్చింది.

కేవలం స్వల్పకాలిక మార్పులు చేర్పులతో ఒరిగేమీ ఉండదు. మధ్యకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలను ఆచరణకు తెస్తేనే ఫలితం ఉంటుందని ప్రభుత్వాలకు మాత్రం తెలియదా? తెలిసినా పట్టించుకోని తత్వమే, ఉదాసీనతా స్వభావమే చేటు తెస్తోంది. 'కొంపణాలు వేల గునపంబు చేబూని/బావి తవ్వనేమి ఫలము కలుగు/ముందు చూపు లేని మూర్ఖుండు/చెడిపోవు' అంటుంది శతక పద్యం. ఇల్లు కాలిపోతూ ఉంటే ఆ నిప్పును ఆర్పే ప్రయత్నమైనా చేయకుండా నీటి కోసం బావిని నిర్మించడం ఎంత మూర్ఖత్వమో ప్రస్ఫుటం చేసింది ఆ రచన.

సరిగ్గా అదే కోవలో ఏ విధమైనా భవిష్యత్ ప్రణాళికా లేకుండా ఎప్పుడు ప్రమాదం సంభవిస్తే అప్పుడు చర్చోపచర్చలు సాగించడం అవివేకం కాదా మరి? విపత్తు స్పందన శాఖగా పేరు మార్చుకున్న ఫైర్ డిపార్ట్‌మెంట్ ఆ పేరుకు సరిపడేలా వ్యవహరించగలుగుతోందా? కేవలం పేరు మార్చేసుకుంటే సరిపోతుందా, తీరు మార్చుకోవాల్సిన అవసరం లేదా.. అనేవి సామాన్యుల సూటి ప్రశ్నలు. తెలుగు రాష్ట్రాలలోని పలు నగరాల హోటళ్లకు, దుకాణ సముదాయాలకు, ఆఖరికి వైద్యశాలల భవనాలకు సైతం అగ్నిభద్రత వసతులంటూ చాలా చోట్ల లేవు. ఏ భవంతి నిర్మించాలన్నా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ నిబంధనలు చెప్తున్నాయి. నిరభ్యంతర పత్రాలను తప్పనిసరిగా పొందాలనీ సూచిస్తున్నాయి. ఆ నియమ నిబంధనలు, సూచనలు, సలహాలను ఎన్ని నిర్మాణ సంస్థలు పాటిస్తున్నాయో తెలుసు మనకు! ఎప్పుడూ తాత్కాలిక చర్యలే! భవన నిర్మాణదారులు చాలావరకు ఎటువంటి నిబంధనలనీ పాటించడం లేదు. ఏదో విధంగా పని పూర్తి చేసి చేతులు దులిపేసుకోవాలన్న తాపత్రయమే కానీ భద్రతా ప్రమాణాలు పాటించాలన్న ఆలోచన శూన్యం.



## మంటలంటుకుంటున్నాయి!

నివాసం ఉంటున్నవారు సైతం చుట్టుపక్కల స్థితిగతులను గమనించలేని వైనం, ప్రమాదాల్ని పసిగట్టి నిరోధించలేని స్వభావం పెనువిపత్తులకు మూలమవుతున్నాయి. నివారణకన్నా నిరోధమే మిన్న. చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం వల్ల



పెనుప్రమాదాలు తప్పుతాయి.

విశాఖలోని ఒక అపార్టుమెంటులో దీపావళి వేళ ప్రమాదం తీరును ఈ సందర్భంగా ఉదాహరిద్దాం. ఓ తారాజువ్వ ఆ భవంతిలోకి దూసుకెళ్లి నేరుగా ఐదో అంతస్తుకు చేరింది. అక్కడి బాల్కనీలోని ప్లాస్టిక్ సామగ్రి మీద పడి అంటుకుంది. అంతే. అగ్ని భగ్గుమంది. పొగ దట్టంగా కమ్ముకుంది. సరిగ్గా అదే భవనం పక్కన పెట్రోలు బంకు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మరో నగరంలో దీపాలు వెలిగిస్తున్న సమయంలో వస్త్రాలకు నిప్పంటుకుని ఒక మహిళ తల్లడిల్లుతుంటే ఆ మంటలను ఆర్పే యత్నంలో భర్త తన ప్రాణాలు కోల్పోయాడు. నిప్పును ఆర్పేందుకు వచ్చిన అగ్నిమాపక యంత్రం ఆ వీధిలో ఇరుకు కారణంగా ఎటూ కదలలేకపోయింది. ఈలోగా జరగకూడని నష్టం జరిగిపోయింది.

హోటళ్లు, ఆస్పత్రులతో పాటు అపార్టుమెంట్ల దగ్గర ఫైరింజన్ రాకకు తగినంత స్థలం ఉండాలి. ఆ వాహనం అటూ ఇటూ తిరిగేందుకు సరిపడా ఖాళీ ఏర్పాటు చేసుకోవాలి. భవనాల ముందర పెద్ద పెద్ద ఆకారాల్లో హోర్డింగులు వంటివి ఉండకూడదు. బాగా నీటి సామర్థ్యమున్న ట్యాంకుల అమరిక, వెంటనే నీరు తోడేలా యంత్ర ఏర్పాట్లు నెలకొనాలి. ఇవన్నీ ఎంతమాత్రం అమలవుతున్నాయో తెలియనిదెరికి? ప్రభుత్వ శాఖల బాధ్యతా రాహిత్యం, ఎటువంటి పర్యవేక్షణా లేక పోవడం, ప్రమాదాలు తలెత్తినపుడు తాత్కాలిక చర్యలతో సరిపెట్టడం ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి.

## దడ పుట్టిస్తున్న గణాంకాలు

జాతీయ స్థాయిలో గణాంకాలు రూపొందించే క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రకారం అగ్నిప్రమాదాలు ఏటేటా సంఖ్యాత్మకంగా పెరుగుతూ వస్తున్నాయి. సిగరెట్లు కాల్చి విసరడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, కొన్ని రకాల ఉపకరణాలు పలు మానవ తప్పిదాలు మంటలు అంటుకునేలా చేస్తున్నాయి. నిరుడు మండుటెండల తీవ్రత భగభగలకు మూలమైంది. గోదావరి ప్రాంతంలో వేడిమికి, ఆ ధాటికి వరికుప్పలు



# నీళ్లలో అగ్నిజ్వాలలు!

విశాఖ సాగర తీరంలోని చేపల రేవులో ఈ మధ్య అర్ధరాత్రి అగ్నిప్రమాదం అందరినీ గజగజ వణికించింది. మంటల్లో కాలిపోయిన అనేక బోట్లలో ఒక్కోదాని విలువ గరిష్టంగా రూ.40 లక్షలు ఉంటుంది. అంటే ఆ ఒక్క సంఘటనలోనే కలిగిన ఆస్తినష్టం రూ.15 కోట్లకు పైనే. బాధితులంతా నిరుపేద మత్స్యకారులు. అగ్నికీలల్లో బోట్లు మండిపోతుంటే జీవనాధారం కళ్లముందే బూడిదవుతుంటే తట్టుకోలేని ఒక వ్యక్తి అవే మంటల్లోకి దూకి ఆత్మాహుతి చేసుకునేందుకు ప్రయత్నించాడు. చేపల వేటకు వెళ్లేందుకు ఉద్దేశించిన పడవలవి. ముందుగా సిద్ధం చేసుకుని ఉంచిన డీజిల్ నిల్వలూ అందులోనే ఉన్నాయి. వాటికితోడు అప్పుడు వేగంగా వీచిన గాలులు తోడై, అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. బోట్లలోనే ఉన్న గ్యాస్ సిలిండర్లు పెద్ద పెద్ద శబ్దాలతో పేలిపోతుంటే ఆ పేలుళ్ల ధాటికి లేచిన అగ్గిరవ్వలు అక్కడికి సమీపంలోని ఒక భవనం గదిలో పడి చెక్కపెట్టెలు కాలి బూడిదవుతుంటే ఆ స్థితి ఎంతో భీతావహం! గంటలు గంటలు గడిచిపోయినా మంటలు ఒక పట్టాన అదుపులోకి రాలేదు. ప్రమాద స్థలానికి దరిదాపుల్లోనే డీజిల్, పెట్రోల్ నిల్వల ట్యాంకర్లు అనేకం ఉన్నాయి. సిలిండర్ల పేలుళ్ల సమయంలో ఆ నిప్పురవ్వలు అవే ట్యాంకర్ల పైన పడి ఉంటే?



అంటుకున్నాయి. మరోచోట.. పెద్ద లోడ్‌తో వెళ్తున్న వాహనానికి విద్యుత్ తీగలు తగిలి నిప్పంటుకుంది. వేరొక చోట పండగ విక్రయాల కోసం సిద్ధపరచి వుంచిన ఈ-బైకులు అగ్నికి ఆహుతయ్యాయి. విజయవాడలోని షోరూమ్‌లోనూ మంటలు వందలాది బైక్‌లను బుగ్గిగా మార్చేశాయి. అదే భవనంలోని ఒక గదిలో నిల్వ ఉంచిన రసాయనాలు, వస్తుసామగ్రి అగ్నికి ఆజ్యం పోశాయి. మరొక్కసారి నాంపల్లి సంఘటనను పరిశీలిస్తే అనూహ్య అంశాలనేకం బయట పడ్డాయి. ప్రమాద స్థలం శాసనసభ దారిదాపుల్లోనిది. సమాచారం అందిన వెంటనే అనేక ఫైరింజన్లు రంగంలోకి దిగాయి. ఆ అపార్టుమెంటులో ఉన్నవారిని ప్రత్యేకించి వనితలు, బాలలను కిటికీల గుండా బయటికి తేవలసి వచ్చింది. ఎందుకంటే అక్కడి మెట్లదారిలో సైతం మంటలే! సిబ్బంది సాహసోపేతంగా రంగంలోకి దిగి, ప్రాణాలకు తెగించి మరీ తమ బాధ్యతలు నిర్వర్తించారు. అయినా అపార్టుమెంట్ వాసులకు ప్రాణనష్టం తప్పలేదు. ఏపీ మొత్తం మీద నమోదైన అగ్నిప్రమాద మృతుల గణాంకాల ప్రకారం ఆ సంఖ్య ఒక సంవత్సరం 250 కాగా, మరో సంవత్సరంలో అది 320. ఐదారేళ్ల కిందటి వివరాల్ని పరిశీలిస్తే ఒక్క ఏడాదిలోనే 596



అగ్నిప్రమాద సంఘటనలు నమోదయ్యాయి. అదే సంవత్సరం (2017)లో ఆ ప్రమాదాల మృతుల సంఖ్య 590. తెలంగాణ పరంగా గత నాలుగేళ్ల కాలంలో ఒక్క హైదరాబాద్ లోనే 46 మంది మృత్యువాత పడ్డారు. ఆస్తి నష్టం.రూ.120 కోట్లకు పైమాటే! ప్రమాదాల సంఖ్య అయితే ఏటేటా 1300 నుంచి 1400 మధ్య ఉంటోందని సమాచార హక్కు చట్టం ఫలితంగా అందిన వివరాలు వెల్లడి చేస్తున్నాయి. గతేడాది ఆ రాష్ట్రంలో నమోదైన అగ్నిప్రమాదాలు 7,368. అంతకు ముందరి ఏడాదికంటే ఇది 900 ఎక్కువ.



### ఆచరణ కావాల్సిందే!

సినిమా థియేటర్లు, తదితర జనసమ్మర్ద ప్రాంతాల్లో కనీసం పాతిక వేల లీటర్ల నీటి సామర్థ్యమున్న ట్యాంకులు భవనాలపై భాగంలో ఉండాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదన్నది బహిరంగ విషయమే. నిబంధనలకు కొదవ లేదు, ఆచరణే కానరాదు. విదేశాల్లో ముఖ్యంగా ఆస్ట్రేలియా ఇప్పటికే రేటింగ్ విధానాన్ని అనుసరిస్తూ వస్తోంది. ప్రమాదాన్ని ముందుగా కనిపెట్టి హెచ్చరించే యంత్రాంగాలూ పుష్కలంగా ఉన్నాయి. అటువంటివేవీ లేనిది ప్రధానంగా మన దేశంలో. అందునా తెలుగు రాష్ట్రాల్లోనే. ఫైర్ సేఫ్టీ ఆడిట్ అనేది మచ్చుకైనా కనిపించని స్థితి. పౌరుల్లో ఎంత అవగాహనను పెంచగలిగితే అంత రక్షణ ఏర్పడుతుంది. ప్రతీ సంవత్సరం జరిగే అగ్నిమాపక వారోత్సవాలు వీటన్నింటి పైనా దృష్టి పెట్టాలి. అగ్ని నిరోధక పరికరాల వాడకం గురించి ఇంటా బయటా విస్తృత ప్రచారం సాగాలి. అప్పుడే ప్రాణాలకు, ఆస్తులకు భద్రత. వంద మాటల కంటే ఒక్క చేత (పని) ఎంతైనా ఉత్తమం!

# అలుపెరుగని నటుడు చంద్ర మోహన్



**సుదీర్ఘ** తెలుగు చలనచిత్ర పరిశ్రమ చరిత్రలో నటుడు చంద్ర మోహన్ ఆధ్యాయం ముగిసింది. ఆయన అసలు పేరు మల్లంపల్లి చంద్రశేఖరరావు. దాదాపు యాభై ఏళ్లుగా చిత్ర పరిశ్రమతో మంచి స్నేహానుబంధం సాగించారు. సుమారు 930 చిత్రాల్లో నటించటం అంటే ఆషామాషీ విషయంకాదు.. ఇందులో 175 చిత్రాలకు పైనే హీరోగా నటించి తెలుగువాకిళ్లలో మంచి నటుడిగా పేరొందారు. తమిళ, మలయాళ, కన్నడ చిత్రాలు కూడా చేశారు. ఇండస్ట్రీలో సుదీర్ఘ అనుభవం గడించి ఇటీవలనే దివికేగిన చంద్రమోహన్ జీవితంలో సాధించిన విజయాలు, ఆయన ఒకింత ఎదుర్కొన్న ఆటుపోట్లు.. ఎన్నోఉన్నాయి..

–ఇండస్ట్రీలో నటుడిగా రంగ ప్రవేశం చేశాక 'రంగులరాట్నం' సినిమా 1966లో విడుదలైంది.. ఆయన నటనకు మంచి పేరుతెచ్చిపెట్టింది.. అందుకు నంది అవార్డు కూడ అందుకున్నారు. అయితే మళ్లీ 6నెలల దాకా మరో సినిమా లేదు.. ఆ తర్వాత 'మరపురాని కథ', 'బంగారు పిచ్చుక' చిత్రాలు వచ్చాయి. ఆపై దాదాపు రెండున్నరేళ్ల దాకా వేషాలే కరువయ్యాయి.. ఒకదశలో ఆయన గురువు బిఎన్‌రెడ్డి ఆయన్ని హీరోగా తప్ప చేయవద్దన్నారు. అందుకే తొలినుంచి చిన్నచిన్న వేషాలు వచ్చిన చంద్రమోహన్ సరేమిరా అన్నారు. ఇదిలా ఉండగా మరోవైపు ఇంటి నుంచి డబ్బులు తెప్పించుకోవటానికి ఒకింత మొహమాటం,. మద్రా వెంకటనారాయణ రోడ్డులో ఉన్న పార్కులో పస్తులతో పడుకున్న రోజులు కూడ ఉన్నాయనే ఆయన అప్పుడప్పుడూ చెబుతుండేవారు. మరో దశలో మద్రాసు విడిచి వెళ్లిపోదామని కూడ అనుకున్నారు.. అయితే పట్టుదల పెరిగి అక్కడే ఉండి తాడోపేడో తేల్చుకుందామని నిర్ణయించుకున్నారాయన.. 'నన్ను నేను పోషించుకోవాలి.. ప్రేక్షకులు నన్ను మర్చిపోకూడదు.' హీరోగానే నటించాలనే ఆయన పట్టుదలను సడలించుకుని నటుడిగా ఒకింత బిజీ అయ్యారాయన ఆరోజుల్లో...

అంతే ఒక్క షాట్‌లో మాత్రమే కన్పించిన సినిమాలు కూడ చేసేశారు.. కాలేజీ విద్యార్థిగా, కమెడియన్‌గా, హీరో తమ్ముడుగా, హీరోయిన్ మరిదిగా ఇలా చిన్నాచితకా పాత్రలు సైతం ఒప్పుకుని కన్పించిన కాసేపుకూడా బాగా మెప్పించారు. ఏ వేషం కట్టినా ఆయన పరిధిలో బాగా చేయటానికి ప్రయత్నించారు. పాత్రలే కావాలనుకుని ఉంటే 50ఏళ్లు నేను ఇండస్ట్రీలో ఉండేవాడిని కాదనిచెబుతూ ఉండేవారు.

– ఆయనకు హీరో వేషాలు ఇచ్చి నిలబెడదామని కొందు దర్శక,నిర్మాతలు ట్రై చేశారు. కానీ ఇంతకుముందు ఆయన వేసిన వేషాలు, పాత్రల ప్రభావం కమర్షియల్‌గా అడ్డుపడింది.. దీంతో ఎవరూ ఒకింత ధైర్యంచేయలేకపోయారు. ఆయన అన్నయ్యఅని పిలుచుకునే కె.విశ్వనాథ్ ధైర్యం చేసి 'సిరిసిరిమువ్వ' చిత్రంలో హీరోగా ఆఫర్ ఇచ్చారు. అంతే.. ఆయన హీరో జీవితానికి తిరిగి నాంది పలికిందా చిత్రం. దీంతో సింగిల్ కాల్షీటు పాత్రలు ఒప్పుకోకుండా చాలా జాగ్రత్త పడ్డారు. అదే సమయంలో 'పదహారేళ్ల వయసు'లో అవకాశం రావటంతో హీరోగా ఆయన స్థానాన్ని ఈచిత్రం సుస్థిరం చేసేసింది.

–"జీవితంలో పరుగు పందెంలో ఉండటం చాలా అవసరం.. అందుకే మరో రకంగా ఆలోచించకుండా టైమ్ ఉండేది కాదు.. ఒక విషయం ఆ సమయంలో నేను ఎదుర్కొన్న సమస్యల పరిష్కారానికి ఎవరి సాయం తీసుకోలేదు..' ' నాఆలోచనలే నన్ను ముందుకు నడిపించాయి.. ఆల్‌రౌండర్‌గా నాకుపేరు రావటంతో చేతినిండా పనిదొరికేలా సినిమాలు ఉండేవి"–చంద్రమోహన్



సతీమణితో చంద్రమోహన్

చంద్రమోహన్ తనకు నచ్చిన చిత్రాలు చాలా ఉన్నాయనే చెప్పేవారు.. సక్సెస్ అయిన సినిమాలు అందరికీ తెలిసినవేనని, అపజయం పాలైన చిత్రాల్లో 'నాగవల్లి', 'సువర్ణసుందరి', వంటి చిత్రాలున్నాయని ఒక దశలో చెప్పారాయన.. హిందీ చిత్రం 'నవరంగ్' స్ఫూర్తితో బీరం మస్తాన్‌రావు స్వీయ దర్శకత్వంలో 'సువర్ణ సుందరి ' రూపుదిద్దుకుంది.. అయితే 70 రోజులపాటు దీని కోసం కష్టపడి పనిచేశారు, కానీ దురదృష్టం ఆ సినిమా అంతగా ఆడలేదు.

ఇండస్ట్రీలో ఆయనకు అత్యంత ఆత్మీయుడు శోభన్‌బాబు.. ఈవిషయాన్ని ఆయనే ప్రస్తావించారు. మంచి స్నేహితుడు, గైడ్‌గా చెప్పుకునేవారు.. ఆయన పద్ధతులు చంద్రమోహన్‌కు చాలా నచ్చేవి. వీరిద్దరు కలిస్తే ఏరా అంటే ఏరా అని





పిలుచుకునేవారు. అంతేకాదు చంద్రమోహన్ చేయి మంచిదని, శోభన్‌బాబు ఏ ఆస్తికొన్నా ప్రతిసారీ చంద్రమోహన్ వద్ద రూ.10వేలు తీసుకునేవారనే విషయం అప్పట్లో అందరికీ తెలిసిన విషయమే.. నటశేఖర కృష్ణతో కూడ చంద్రమోహన్ సత్సంబంధాలుకలిగి ఉండేవారు.

– విశేషం ఏంటంటే..కృష్ణ–విజయనిర్మల పెళ్లి విషయంలో కృష్ణకు సపోర్ట్‌చేయటం ఒకదశలో ఆయన ముఖ్యమని భావించారు. వారిద్దరికీ చంద్రమోహన్ మంచి స్నేహితుడుకావటంతో వారి పెళ్లి బాధ్యతను వారు చంద్రమోహన్ పైనే పెట్టేశారు. అంతేతడవుగా, మేకప్‌మ్యాన్ మాధవరావు, నిర్మాత రాఘవ, జర్నలిస్టు మోహన్‌కుమార్ అందరూ తిరుపతికి వెళ్లి కృష్ణ–విజయనిర్మల వివాహం జరిపించారు ..



– అందరికీ తెలిసిన విషయం మరోకటుంది.. యాదృచ్ఛికమే అయినా చంద్రమోహన్‌తో కలిసి నటించిన దాదాపు 60 మంది హీరోయిన్లలో అత్యధికం అగ్రస్థానానికి చేరుకోవటం.. శ్రీదేవి, జయసుధ, జయప్రద, విజయనిర్మల, వాణిశ్రీ, మంజుల, చంద్రకళ వంటి హీరోయిన్లుకు చంద్రమోహనే తొలి హీరో.. అదృష్టం, ప్రతిభ కారణాలుకావచ్చు. 'చంద్రమోహన్ పక్కన నటిస్తే చాలు టాప్ హీరోయిన్ పొజిషన్ గ్యారెంటీ' అనే సెంటిమెంట్ ఆరోజుల్లో సుడిగాలిలా వ్యాపించటం నిజంగా ఇండస్ట్రీలో విశేషం.

–చంద్రమోహన్‌లో టాలెంట్ ఉందని బిఎన్‌రెడ్డి, బాలచందర్, ఎస్వీ రంగారావు అంటూ ఉండేవారు. దర్శకులు ఎంత తీసుకోగలిగితేఅంత ప్రతిభ ఆయనలో ఉందని చెప్పేవారు. మరోవైపు పెద్దల ఆశీస్సులకు ఒకింత న్యాయం చేసే పాత్రల కోసం చంద్రమోహన్ ఎంతగానో ఎదురుచూసేవారు. ఒక విధంగా చెప్పాలంటే బిఎన్‌రెడ్డి వేసిన పునాది చంద్రమోహన్‌ను నటశిఖరాగ్రాలకు చేర్చింది. కె.విశ్వనాథ్, బాపు, బాలచందర్, రాఘవేంద్రరావు, వాసు, రేలంగి నరసింహారావు వంటి ప్రముఖ దర్శకుల వద్ద పనిచేశారు. ఒకదశలో విశ్వనాథ్ తననెంతో తీర్చిదిద్దారని చంద్రమోహన్ పలుమార్లు వివిధ సందర్భాల్లో ప్రస్తావించేశారు.

– ప్రజల అభిమానమే నాకు అవార్డులు, రివార్డులుఅని చెప్పుకునే చంద్రమోహన్ .. తన సీనియర్స్ సావిత్రి, కన్నాంబ, ఎస్వీ రంగారావు, సూర్యకాంతం, వీరంతా గొప్పగొప్ప అవార్డులకు అర్హులని, వారికి ఇచ్చిఉంటే నిజంగా అవార్డులకు గౌరవం వచ్చేదని, తనకంటే ఎంతో ప్రతిభ కలిగిన వారికే 'పద్మశ్రీ' వంటి పురస్కారాలు దక్కలేదని అందుకే వాటిపై నాకు ఆసక్తి లేదు' అని చంద్రమోహన్ ఖరాకండీగా చెప్పేవారు.

– ఇండస్ట్రీలో నటుడుగా ఎంతో ఎత్తు ఎదిగిన చంద్రమోహన్ నుద్దేశించి.. 'అడుగు ఎత్తు ఎక్కువుంటే నన్ను దాటి పోయేవాడివయ్యా.. ' అంటూ అప్పట్లో ఏఎన్నార్ అంటూ ఉండేవారు.. అలా మరో అడుగు ఎత్తు ఉండుంటే ఇన్ని సినిమాలు చేసేవాడినా అనేది సందేహమే అంటూ చంద్రమోహన్ స్పందించారు. చాలాసార్లు ఎన్టీఆర్‌లా పౌరాణిక వేషాలు వేయాలి... పద్యాలు పాడాలని కోరిక ఉండేదని, కానీ అపుడు నిజంగా నా పర్సనాలిటీ అడ్డుపడిందని , నా పక్కన హీరోయిన్స్‌తో కూడ హైట్ పరంగా కొన్ని సమస్యలు వచ్చాయని చంద్రమోహన్ నిర్మొహమాటంగా చెప్పారు. 'యశోధాకృష్ణ' చేసేటపుడు శ్రీదేవి చాలా చిన్నపిల్ల షూటింగ్ అయ్యాక మద్రాసు తిరిగి వస్తున్నపుడు ఒళ్లో పడుకుని నిద్రపోయేది.. ఆమె నా తొలినాళ్లలో నాపక్కన హీరోయిన్‌గా నటించింది.. కానీ నాకంటే పొడుగు పెరిగిపోయిందని చంద్రమోహన్ ఇటీవల ఓ సందర్భంలో ప్రస్తావించారు. కొన్నిసార్లు తన పర్సనాలిటీ వల్ల పలు ఇబ్బందులు ఎదుర్కొన్నానని తనమనోగతాన్ని వ్యక్తంచేశారు అప్పట్లో..ఒక్క హీరోయిన్‌తోనే 10నుంచి 15 సినిమాలు చేసిన చంద్రమోహన్ తనకు నచ్చిన హీరోయిన్ ఎవరని అడిగితే జయసుధ అని చెప్పారు.ఏకంగా 34 చిత్రాల్లో ఈ జంట నటించి తెలుగు ప్రేక్షకులకు కనువిందుచేశారు. తన ఇష్టదైవం గురించి ఒకానొక సందర్భంలో ప్రస్తావిస్తూ 'మేం లింగధారులం.. శివుడు మాకు ఇష్టదైవం.. రోజూ పంచాక్షరి, మృత్యుంజయ మంత్రం పఠిస్తుంటానని చెప్పిన చంద్రమోహన్ ఇటీవలనే శివైక్యం పొంది తెలుగు వలన చిత్ర పరిశ్రమ బతికినన్నాళ్లు ఆయన పేరు విన్పించేలా అనంత లోకాలకు చేరుకున్నారు.

**- కె.సురేష్‌బాబు**

## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్–500 080. sunmagvaartha@gmail.com



# మరలా వస్తావా!!

అప్పుడప్పుడు
ఆకాశాన్ని వంచి తెచ్చి ఇచ్చిస్తానంటాను!
ఎంత మురిసిపోతోందో అమ్మ!
'ఆమె'కైతే
ఎన్ని కోటలు దాటించేసానో!
సంసార నౌక సాగాలిగా..!
ఎన్ని నా వాగ్దానాలు
అక్క కష్టాల కడలిలో
కలిసిపోయాయో!
చూడు ఎంత నమ్మకమో
కళ్లు ఆర్పకుండా
ఇంకా నా వైపు చూస్తుంది
పిచ్చితల్లి! నా చిట్టి చెల్లి!
నాన్నా!
నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా
నిన్ను మరిపించాలనిపిస్తుంది!!
మరలా వస్తావా?
కొన్నాళ్లు నన్ను మళ్లీ నడిపిస్తావా!!

**- తిప్పాన హరిరెడ్డి**

# ఈవారం కవిత్వం

## సంకల్పం

అసాధ్యం కాదేదీ
లక్ష్యం దిశగా అడుగులు వేస్తూ
పట్టుదలకు పగ్గాలు నువ్వప్పగిస్తే!
శ్రమకు శ్రమ తెలియదుగా
శ్రమను నమ్ముకుని శిఖరాలను చేరుతుంటే
నలుగురికి వేకువ చుక్కానిగా నువ్వు నిలుస్తుంటే.
నేనూ అనే స్వార్థం విడనాడి
మనం అనే పదాలను పలికే ప్రతి క్షణం
విజయం నీ సొంతమేగా..
గెలుపు బావుటా ఎగురవేసేది
నీ తోటివారేగా
వారి విజయ దరహాసమే
నీ ఆత్మతృప్తికి దక్కే పురస్కారమేగా.
సుదూర తీరాలను చేరాలనే నీ సంకల్పం
చరిత్రలో యువతకు దిశానిర్దేశం.
అదే నీ ఉనికికి సాక్ష్యం.

**- రాము కోలా**

# ఒత్తిడిని ఓడిద్దాం

పోటీ ప్రపంచం ఒక వైపు
పోలికలు ఏలికలు మరోవైపు
ఉరుకుల పరుగుల ప్రపంచంలో
ఆందోళన అలజడి ఆవేశంతో
జీవన సమరంలో అలిసిపోయి
ఒత్తిడిలో బందీయై
మనోదౌర్బల్యత/ రాజ్యమేలుతుంది
మనసులో ప్రశాంతత/ మందగించి
మొక్కలా మొదలైన ఒత్తిడి
వటవృక్షమై
సంపదగా పరిణమించి
ఆరోగ్యాన్ని మంటకలిపి
కుంగుపాటు ఆస్తిగా
ఒంటరితనమే నేస్తమయ్యే
పాజిటివ్ ఆలోచనలతో/
ఒత్తిడిని ఓడించు
ధైర్యమే నీ ఆయుధం కావాలి
ఆత్మవిశ్వాసమే నీ పెట్టుబడి అవుతె
ప్రగతిశీల ఆలోచనలతో
ఆశావహ దృక్పథంతో
ప్రతిరోజు ఆరంభించాలి
జీవితం ఒక మొక్క లాంటిది
నవ్వులే పువ్వులుగా వికసిస్తే
ప్రతిరోజు పండుగే
జరిగింది జరుగబోయేది
మన మంచికే
గతమంతా ఒక పీడకల
ఉజ్వల భవిష్యత్తు కోసం
ఉషారు ఉల్లాసమే జీవన శైలిగా
మనో ప్రశాంతతకు పాటుపడదాం
ప్రగతికి పురోగతికి బాట వేద్దాం
ఒత్తిడిని ఓడిద్దాం.



**- నేదునూరి కనకయ్య**

# పుస్తక సమీక్ష

## శరద్యుతి-నౌకావలోకనం




ఈ పుస్తకాన్ని రచయిత్రి తన అత్తగారు పుష్పవల్లికి అంకితం చేశారు. సర్వం శ్రీకృష్ణ మయం జగత్ అంటూ ప్రతిపుటలో శ్రీకృష్ణస్వామి లీలావైభవాన్ని నవవిధభక్తిభావ సౌందర్యం, నవరసాల సమాహార ఝరిగా సాగుతుంది. ఈ విలువైన ఆధ్యాత్మిక గ్రంథానికి కొమాండూరి శేషాద్రి (రచయిత్ర మామగారు) ముందుమాటలో చెప్పినట్లుగా శరద్యుతి అడుగడుగునా తన నిర్మల భావనాగరి మనురసపట్టుగా పెంచి తనదైన సుందర కృష్ణుని జతకూడి నౌకావలోకనాన తానే నౌకయై జనగణుల క్రీడాభిరామమున ఉత్సాహ పరిచినది అంటారు. రచయిత్రి తల్లిదండ్రులు సుజాత, రఘునాథ్, కృష్ణకూచి, కొల్లూరు వందన, జయంతి సావిత్రి, భువనచంద్ర చక్కటి ముందుమాటలు రాసారు. శ్రీకృష్ణుని జననం దేవకీ వసుదేవుల అష్టమ సంతానంగా ఉద్భవించి, వసుదేవునిచే యమునా నది దాటి రేపల్లెలో యశోదానందుల ఆడబిడ్డ స్థానంలో కృష్ణుడు ఉండటం, యోగమాయ (ఆడశిశువు) మధురకి చేర్చి దేవకి వద్ద వుంచడం కంసుని కర్కశత్వం నుండి ఆరంభమైన యీ రచన యమునలో నౌకావిహారానికై ప్రలోభపడిన గోపికామణుల సౌందర్య గర్వమును అణిచిన వృత్తాంతమునే భక్తి-రస పూరితంగా త్యాగరాజు రాసిన రచనను భావావేశాన పునర్వ్యక్తం చేసారు రచయిత్రి.

**(నౌకావలోకనం, రచన: శరద్యుతి, వెల: రూ 200, ప్రతులకు: నవోదయ బుక్‌హౌస్)**

**- తంగిరాల చక్రవర్తి**

## ఠాగూర్ 'గీతాంజలి' రఘువర్మ స్వేచ్ఛానువాదం




యిటీవలే 'మేఘసందేశమే' మరియు 'ఋతు సంహారః' సంస్కృత మహాకావ్యాలను తెలుగులోకి స్వేచ్ఛానువాదం గావించిన కవీ, చిత్రలేఖనంలో ప్రావీణ్యుడు అయిన 'రఘువర్మ' తాజాగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విరచిత 'గీతాంజలి' గ్రంథాన్ని తెలుగులోకి స్వేచ్ఛాను వాదం గావిస్తూ 103 కవితల గ్రంథాన్ని వెలువరించారు. 1913 సంవత్సరంలో నోబెల్ పురస్కారాన్ని అందుకున్న మహాకావ్యం 'గీతాంజలి' ఠాగూర్ బెంగాలీభాషలో రాసిన ఆధ్యాత్మిక, తాత్విక గ్రంథాన్ని తానే స్వయంగా ఆంగ్లభాషలోకి తర్జుమాచేసి అంత ర్జాతీయ ప్రతిష్ఠాత్మక నోబెల్ అవార్డును కైవశం చేసుకున్నారు. అప్పటి నుండి 'గీతాంజలి' ఒక్క తెలుగులోనే వందకు మించి అనువాదాలు వచ్చిన విషయం గమనార్హం. యిప్పుడు తాజాగా రఘువర్మ అనువాదం ప్రతీగ్రంథం ఆయాకవుల అనువాద పటిమను, సృజనాత్మకశక్తికి ప్రతిబింబిస్తాయి. 'గీతాంజలి' అంటే కవి తన గీతాలతో భగవంతుడికి అంజలి ఘటించడం. తాదాత్మ్య స్థితిలో భక్తుడు తనను తాను భగవంతుడికి సమర్పించుకోవడం. అత్యంత సరళమైన భాషలో రఘువర్మ రాసిన తెలుగు కవితలు చదివింతర్వాత యివి అనువాదంలా తోచవు. మూలభాషే 'తెలుగు' అన్నంత మధురంగా అనుభూతినిస్తాయి. యింత వరకు 'గీతాంజలి' చదవని వారికి రఘువర్మ అనువాద గ్రంథం చదవ డం ఒక గొప్ప అనుభవం. చదవండి..అనుభూతించండి.

**గీతాంజలి, స్వేచ్ఛాకవితానువాదం 'రఘువర్మ', డా॥టి. లక్ష్మీ నారాయణ, వెల:రూ 150, ప్రతులకు:. 3-1-264, పురాణిపేట్, జగిత్యాల) - రమణ వెలమకన్ని**

## పల్లెబతుకుల జీవనాన్ని తెలిపే 'గాండ్లమిట్ట'

ఆర్.సి.కృష్ణస్వామిరాజు కథలలో మానవత్వం, సాహిత్య ప్రయోజనంగా తొణికిసలాడుతూ ఉంటుంది. బాల్యం పుట్టి పెరిగిన ఊరిజ్ఞాపకాలు, పల్లెల బతుకుకథలలో దైన్యం, ధైర్యం కృష్ణస్వామిరాజు సాక్షాత్కరింపచేస్తారు. గాండ్లమిట్ట కథసంపుటిలో ఇరవై కథలున్నాయి. 'మేము నడిచిన భూమి మాకు నీడనిచ్చిన చెట్లు, ఇక్కడి నీళ్ల తాగినోళ్ళం, ఇక్కడి గాలి పీల్చినోళ్ళం' అంటూ తన ఊళ్ళో ప్రతిశవం గౌరవమర్యాదలతో వేళ్లే సహాయానికి



ముందుకు వచ్చే ఆదిమూలం పాత్ర 'గాండ్లమిట్ట' కథలో హృదయాన్ని కదిలిస్తుంది. ముగ్గురు అక్క చెల్లెళ్లు, అమ్మ కోసం బావి తవ్వడం, 'నీళ్లబావి' కథలో, నీళ్ల విలువతోపాటు యువమహిళాశక్తి అద్భు తంగా ప్రదర్శింపచేస్తుంది. తెలుగునాట పల్లెల్లోని నోళ్లల్లో అలవోకగా దొర్లిపోయే సామెతలని కథలలో ప్రయోగించడం, కథలకు శీర్షికలుగా రూపొందింపచేసి పల్లీయుల జీవితాలను సజీవం చేసే సంఘటనలను అత్యుత్తమ కథలుగా రచయిత సృష్టించారు. 'పాడిలేని ఇల్లు పేడలేని చేను' ఆవు దూడల కథ 'కృష్ణస్వామిరాజు' ఒక్కరే రాయగల అపురూప కథనం, పల్లెలలో మూగజీవాల కన్నీళ్లు, పుట్టిపెరిగిన 'నా ఊరికి ఏమయ్యింది?' వంటి కథలే కాకుండా ఈ సంపుటిలో పొగతాగడం హానికరం అని చెప్పే 'బూడిదైపోవద్దు', ఆత్మ విశ్వాసంతో అడుగు ముందుకు వేసిన దాక్షాయణిపాత్ర వున్న 'బంగారం సంచి', దేశరక్షణకు సాహసంతో త్యాగం చేసే సైనికుల తల్లులు వీరసైని కులుగా సంభావించే 'అమ్మకు జేజేలు', 'మస్తాన్‌రెడ్డి', వైవిధ్యభరితమైన కథలున్నాయి. **(గాండ్లమిట్ట, రచన: ఆర్.సి. కృష్ణ స్వామిరాజు, 22-4-71, బ్యాంక్‌కాలనీ, మంగళంరోడ్, తిరుపతి) - యర్రమిల్లి**

## కరోనాపై నవల

300కుపైగా కథలు, వ్యంగ్య కథా సీరీస్,నవలలు రాసి పాఠకలోకం మన్ననలందుకున్న రచయిత టి.ఎస్.ఎ.కృష్ణమూర్తి అందిస్తోన్న లేటెస్ట్ కానుక 'భయంలేని బ్రతుకు' నవల. 2019లో మొదలై ప్రపంచాన్నంతా ఓ ఊపు ఊపిన 'కరోనా'



ఈ నవలకు మూలవస్తువు. అంతదనుక నల్లేరు మీద నడకలా సాఫీగా సాగుతోన్న ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసి మూడేళ్లపాటు పీడించి ఆర్థిక, సామాజిక స్థితిగతుల్ని అతలాకుతలం చేసిన 'కరోనా 19' మహ మ్మారి, బ్లాక్ ఫంగస్, ఒమిక్రాన్‌వంటి రూపాంతరాలు అవి సమసి పోయి, నెమ్మదిగా, దేశం, ప్రపంచం యథాస్థితికి వస్తోన్నతీరు చక్కని ఉత్కంఠతో రాయబడింది. చోటు చేసుకున్న పరిణామాల్ని, వాటి పూర్వాపరాలని గ్రంథస్థం చేయటం ఒక చారిత్రక అవసరం. ముందుతరాల వారికి మార్గదర్శకం. ప్రథమ పురుషలో సాగిన ఈ నవలలో రాజారావు, కన్నయ్య, ఖాజాహుసేన్, కుచేలయ్య తిరుపతిరావు రామిరెడ్డి, పాలుపోసే వెంకట్రావులను వివిధ ఆర్థిక స్థాయిల్లో నిలిపి ఎవరు, ఎవరి కుటుంబం ఎలా విచ్చినమయంది, ఎవరి కుటుంబం ఎలా గట్టుకు చేరిందో వివరిస్తుంది నవల. 'భయం లేని బ్రతుకు' అన్న టైటిల్ బహుశా ఈ నవలకు సరిగానప్ప దేమో అనిపిస్తుంది. **(భయంలేని బ్రతుకు, రచన: టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి, వెల: రూ, 160, ప్రతులకు: 169-16, రామారావు కాలనీ, బాపూజీ ఎలిమెంటరీ స్కూల్‌రోడ్, మదనపల్లి) - కూర చిదంబరం**



# మినరల్ మాయతో ప్ర'జల' కష్టాలు!





తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి

**నీళ్లు** ప్రాణ కోటికి జీవనాధారం. ఇది శరీర పోషణకు మౌలికమైన అవసరమని తెలియంది కాదు. మామూలుగా మనం తాగే మంచినీటికి, మినరల్ వాటర్‌కీ తేడా ఉండకూడదు. కానీ మనకు సరఫరా అయ్యే నీరు ఒకోసారి వివిధ కారణాల వల్ల తాగడానికి పూర్తిగా అనువుగా ఉండకపోవచ్చు. చెరువులు, ఆనకట్టలు, నదుల్లోంచి సేకరించి శుద్ధి చేసే ప్రక్రియలో, ఆ నీటిని సరఫరా చేసే క్రమంలో అది కలుషితమయ్యే అవకాశం ఉండవచ్చు. అలాంటప్పుడు ఆ నీటిని కాచి వడపోసుకుని తాగితే సరిపోతుంది. ఇక మినరల్ వాటర్‌ని సాధారణంగా బోరు బావుల్నుంచి సేకరించి అందులోని అదనపు లవణాలను రివర్స్ ఆస్మాసిస్ అనే ప్రక్రియ ద్వారా తొలగించి, ఆపై అవసరమైన లవణాలను కలుపుతారు. తగుపాళ్లలో అన్ని పదార్థాలూ ఉండడం వల్ల మినరల్ వాటర్‌కి ప్రత్యేక రుచి చేకూరుతుంది. మినరల్ అంటే లవణ పదార్థమని అర్థం. దుకాణాల్లో వాటర్ క్యాన్లు, వాటర్ బాటిల్స్‌లో గల నీరు కుళాయిల్లో వచ్చే నీటి కంటే సురక్షితం కాదని బ్రిటన్‌లో నిర్వహించిన సర్వేలో తేలింది. కుళాయిలో వచ్చే నీటి సురక్షితం కాదంటూ, చాలామంది వాటర్ క్యాన్స్ కొనడం చేస్తున్నారు. పెద్దపెద్ద ప్లాస్టిక్ క్యాన్స్‌లో వచ్చే నీటిని ఏమాత్రం ఆలోచించకుండా తాగేస్తుంటారు. అయితే ఇక జాగ్రత్తపడండి. కుళాయి నీటిలోని క్లోరిన్..బ్యాక్టీరియా నుంచి మనల్ని కాపాడుతుంది. అదే వాటర్ బాటిల్స్‌లో ఉన్న నీరు తాగితే..అంతే సంగతులు.

ఇంకా వాటర్ క్యాన్లలోని నీటిని మూత తీసిన వెంటనే తాగేయాలి. రెండు, మూడు రోజులు అలానే ఉంచడం మంచిదని కాదని బ్రిటన్ శాస్త్రవేత్తలు అంటున్నారు. అందుచేత వాటర్ క్యాన్‌లోని నీటికంటే కుళాయి తాగడం ఎంతో శ్రేష్టమైన ఆరోగ్య నిపుణులు అంటున్నారు. చట్టాలలోని లోపాలే నీటి ఉత్పత్తిదారులకు వరంలా మారుతోంది. ఆ లోపాలే వినియోగదారుడి జేబులకు చిల్లుపెడుతోంది. అరకొర మంచినీటి సరఫరా, కలుషిత వాటర్ పంపిణీతో ప్రజలు బెంబేలెత్తి నీటి క్యాన్లు, బాటిల్స్, ప్యాకెట్ల కోసం ఎగపడటంతో నీటి ఉత్పత్తిదారుల ప్రమాణాలు గాలికి వదలి మరింత సొమ్ము చేసుకునేందుకు వీలు కల్గుతుంది. వేసవి నీటి ఎద్దడిని, బాటిల్స్, నీటి ప్యాకెట్ల పట్ల వినియోగదారుల అభిరుచిని దృష్టిలో పెట్టుకుని వీధికో మినీ మినరల్ నీటి ప్లాంట్‌లు వెలుస్తున్నాయి. కొందరు నీటి వ్యాపారులైతే మున్సిపల్ కుళాయిల వద్దనే క్యాన్లు నింపి వాటికి సీల్ వేస్తూ మినరల్ వాటర్‌గా విక్రయాలు చేస్తున్న సందర్భాలూ లేకపోలేదు. సొమ్ము చెల్లించి మనం తాగుతున్న నీటిలో ఏం లేదో అనేకాదు, ఏమి ఉందో కూడా మనం తెలుసుకోవాల్సి ఉంది. నీటిని కొంటున్నామంటే కేవలం నీరును కొనటమే కాదు, ఆరోగ్యాన్ని కొనటమని అర్థం చేసుకోవాలి. అంతేకానీ 'సొమ్ముపోయే శనీ పట్టే' అన్న చందంగా కొన్ని నీటి విక్రయ కంపెనీలు వెలుస్తున్నాయి. సరైన విధివిధానాలు, నిబంధనలు లేకపోవటంతో కనీస అర్హత, అనుభవం లేని ఎంతోమంది ఈ రంగంలోకి అడుగుపెడుతున్నారు. ఈ కారణంగానే మార్కెట్‌లోకి కల్తీ బ్రాండ్స్ ఇబ్బడిముబ్బడిగా ప్రవేశించి ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నాయి. మన శరీరంలోని 60 శాతం బరువు నీటి కారణంగానే ఏర్పడుతుంది. అయితే నీటిలో కొన్ని దారుణమైన సమస్యలు కూడా వున్నాయి. ముఖ్యంగా కలుషిత నీటివల్ల రోజూ లక్షలాది మంది అతిసారం, జీర్ణకోశ సంబంధమైన వ్యాధులు, విషజ్వరం వంటి ప్రాణాంతక వ్యాధులతో బాధపడు తున్నారు. వేసవిలో మునిసిపల్ పంపులు, గొట్టాల నుండి మంచినీళ్ల సంపాదించటం బహుకష్టంగా మారింది. దీంతో చాలా ఇళ్లలో మంచినీటి కోసం ఫిల్టర్లు కొనుగోలు తప్పనిసరి అయింది. ప్రయాణాలు చేస్తున్నా, ఏదైనా హోటల్‌లో టిఫెన్, భోజనం చేయాల్సి వచ్చినా తప్పని సరిగా నీళ్లసీసా కొనటం సర్వసాధారణమైపోయింది.

ప్రస్తుతం ప్రతి టీ బంకులలో కూడా ప్యాకెట్, విడిగా అరలీటర్, లీటర్ సీసాలలో 'సురక్షితమైన తాగునీరు పేరిట విక్రయాలు జరుగుతున్నాయి. తాము అందించే నీరు నూటికి నూరుపాళ్లు సూక్ష్మజీవులకు ఆస్కారం లేని స్వచ్ఛమైన నీరని, రుచితో పాటు ఆరోగ్యం అని చాలా కంపెనీలు తెగ ప్రచారం చేసుకుంటున్నాయి. అయితే ఇలా సీసాలలో, ప్యాకెట్లలో విక్రయించే నీరు సురక్షితమైనదేనా? ప్రమాణాలకు తగ్గట్టు ఉంటున్నాయా? అని ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాల్సిన అవసరం ఉంది. అసలు మినరల్ వాటర్ అనే మాటకు అర్థమే మారిపోయింది. కారణం నీళ్లసీసా మీద మినరల్ వాటర్ అని రాయాలంటే ఎంత మేరకు అందులో మినరల్స్ ఉండాలనే దానిపై పరిమితులు ఏమీ లేవు. అందుకు ప్రత్యేక నియమనిబంధనలు కూడా ఏమీ లేవు. శరవేగంగా కంపెనీలు వస్తున్నాయంటే అందుకు కారణం మన పురపాలక సంఘాలు సరఫరా చేసే నీరు సురక్షితమైనది కాదని అభిప్రాయం ప్రజల్లో బాగా పాతుకుపోయింది. అంతకంటే ఎంతోకొంత ఈ నీళ్ల నయమనే కొనుగోలు చేస్తున్నారు. బాక్టీరియా లేని, పరిశుద్ధమైన నీరుగా భావించి కొనుగోలు చేస్తున్నారు. రుచి దేవుడెరుగు కొన్ని కంపెనీల నీళ్ల ప్యాకెట్లు దుర్వాసన వస్తున్నాయని ఆరోపణలు వున్నాయి అయితే తాము పరిశుభ్రమైన నీటిని సరఫరా చేసేందుకు రకరకాల పద్ధతులు పాటిస్తున్నట్లు కంపెనీలు చెబుతున్నా ఏ మేరకు ఆ నీటిని శుభ్రపరిచింది, వాటిలో ఖనిజ లవణాలు ఏమేరకు వున్నాయన్న విషయం కూడా చెప్పలేకపోవటం గమనార్హం. సీసాలలో నింపేనీరు వీలైనంత వరకు ప్రమాణాలను సవరించాల్సి ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. వాటర్ బాటిల్ రంగానికి ఒక నిర్దిష్టమైన పారిశ్రామిక లైసెన్స్ విధానం లేకపోవటం ఈ సమస్యను మరింత పెంచి పెద్దది చేస్తోంది. నీటిని ఎక్కడ నుండి తెస్తున్నారో. వాటి శుద్ధికి ఎటువంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారో తెలియజేయాల్సిన అవసరం లేకుండానే ఎవరైనా, ఎక్కడైనా వాటర్ బాటిల్ కార్మాగారాన్ని నెలకొల్పు కోవచ్చునన్న మాట. కొన్ని వాటర్ బాటిల్స్, ప్యాకెట్లలో ఏవో తెలియని పదార్థాలు కన్పిస్తున్నా యని, బస్టాండ్, రైల్వేస్టేషన్ వద్ద అమ్ముతున్న నీటి ప్యాకెట్లలలో అసలు నాణ్యత ఉండటం లేదని, కొన్నిసార్లు అయితే అవి దుర్వాసన కూడా వస్తున్నా యని ప్రయాణికులు గగ్గోలు పెడుతు న్నారు. గొంతు తడుపుకోవటానికి తప్పని సరై కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా కుళాయిలో వచ్చే నీటికంటే అధ్వాన్నంగా వుంటున్నాయని అంటున్నారు. నీటి శుభ్రతలో ప్రమాణాలు సరిగా పాటించక పోతే ఆరోగ్యానికి మరింత హాని కలిగే ప్రమాదం ఉంటుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు. నీటి వాడకంలో అల్యూమినియం కనుక ఎక్కువ అయితే మెదడు దెబ్బతింటుందని వైద్యనిపుణులు అంటున్నారు.మనుసులకు కొద్దిపాటి ఫ్లోరైడ్



అవసరం ఉందని, అయితే మోతాదుకు మించి ఫ్లోరైడ్ వినియోగిస్తే ఫ్లోరోసిస్ వంటి వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. మినరల్ వాటర్ పేరిట ఉప్పునీటిని కాస్త జల్లడపట్టి శుభ్రం చేస్తు వినియోగదారులకు లేనిరోగాలను అంటగడుతున్న విషయంపై ప్రజలు విమర్శలు కురిపిస్తున్నారు. నిబంధనలు పూర్తిగా విస్మరించిన వాటర్ ప్లాంట్ నిర్వాహకులు అధికారుల చేతులు 'తడపడం'తో వ్యాపారం మూడుపువ్వులు, ఆరుకాయలుగా కొనసాగుతుందని ప్రజలు అంటున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వహించాలంటే నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందే. వాటర్ ప్లాంట్‌లో మైక్రోబయాలజిస్టు, కెమిస్టులు విధిగా ఉండాలి. వీరు ఎప్పటికప్పుడు శుద్ధిచేసిన నీటి ప్రమాణాలను ల్యాబులో పరిశీలిం చాల్సి ఉంటుంది. పిహెచ్ 7కంటే తగ్గితే కిడ్నీ సంబంధిత సమస్యలు వస్తాయని బిఐఎస్, సంబంధిత వైద్యులు ప్రజలకు సూచిస్తున్నారు. పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మినరల్ పేరుతో అమాయక ప్రజలు నిలువుదోపిడీకి గురవుతున్నారు. విజిలెన్స్ అధికారులు దాడులు చేస్తే నకిలీ మినరల్ వాటర్ కేంద్రాలు భయపడే అవకాశం వుంది. మినరల్ వాటర్ తయారీదారులు ఒకసారి ఆ నీటిని చెక్ చేసి బాటిల్స్‌లో లాక్ చేస్తేనే నెలలు గడిచినా ఆ నీరు అలాగే ఉంటుంది. వాటర్ క్యాన్ నీటిలో క్లోరిన్ శాతం చాలా తక్కువ. తద్వారా వాటర్ క్యానుల్లో నీరు సేవిస్తే వ్యాధినిరోధక శక్తి చాలా తగ్గిపోతుంది. కుళాయి నీటిని బాగా వేడిచేసి చల్లార్చి తాగవచ్చు. నాణ్యతా ప్రమాణాలు లేని ఈ మంచి నీళ్ల విభిన్న రూపాల్లో మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. భద్రతా ప్రమాణాలు లోపించి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. అక్రమ వ్యాపారుల జేబులు కాసులతో గలగల లాడుతున్నాయి. వేసవికాలం ప్రారంభం కావటంతో మంచి నీటికి డిమాండ్ పెరుగుతోంది. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా పలు ప్రైవేటు కంపెనీలు ఇష్టారాజ్యంగా మంచినీటి వ్యాపారాన్ని కొనసాగిస్తూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నాయి. సీసాలు, ప్యాకెట్లు, క్యాన్ల రూపంలో చిన్న దుకాణాల నుంచి గల్లీల్లోని హోటళ్లు, మెస్‌లు, సినిమా థియేటర్లు, కూల్‌డ్రింక్ షాపులు, పాన్ దుకాణాల్లో సైతం ఇవి లభిస్తున్నా యి. మినరల్ వాటర్ వలన మన శరీరంలో ఎముకల చుట్టూ ఉండే కాల్షియం కరిగిపో యి ఎముకలు డొల్ల అవుతున్నాయి. దీని వల్ల ఎముక పటుత్వం కోల్పోయి చిన్న చిన్న సంఘటనలకే విరిగిపోతున్నాయి. మన పూర్వీకులు కొన్ని లక్షల సంవత్స రాల క్రితమే మన ఆరోగ్యం కోసం కొన్ని సూత్రాలు చెప్పారు. నీటిని శుభ్రపరిచేం దుకు రాగి,ఇత్తడి బిందెలు, చెంబులు వాడే వారు. వీటిని వాడటం వలన నీటిలో ఉం డే సూక్ష్మక్రిములు చనిపోతాయి. ఈమధ్య జరిగిన ఒక ప్రయోగంలో 'రోబోరేడ్' అనే శాస్త్రవేత్త ప్లాస్టిక్ పాత్రలు, మట్టి పాత్రలు, ఇత్తడి, రాగి పాత్రలలో విరోచనకారి అయి న ఒక సూక్ష్మక్రిమిని వేశారు. దీనిని 24 గంటల తరువాత పరిశీలించగా రాగి, ఇత్తడి పాత్రలలో క్రిములు 99శాతం నశిం చిపోయాయి. కాని ప్లాస్టిక్, పాత్రలలో వేసిన క్రిమి 24 గంటలకి రెట్టింపు అయింది.రాగి, ఇత్తడి పాత్రలను వాడండి. ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ❑

కథ

# విద్య విలువ


'నాయనా ముందే చెబుతున్నా చీట్లు చివరిదాకా పాడటానికి వీలు లేదు ఇది నా నిబంధన' అన్నాడు రంగనాథం.

'అలాగే నా నమ్మకం కొరకు నేను తమ వద్ద రెండు చీట్లు వేస్తున్నట్లు పత్రం రాసి ఇవ్వండి' అన్నాడు లక్ష్మణుడు.

'నేను చదువుకోలేదు అడుగో రచ్చబండపై చలమయ్య ఉన్నాడు. అతనిచే రాయించుకురా వేలిముద్రవేస్తాను' అన్నాడు రంగనాథం.


పత్ర రాస్తున్న చలమయ్య 'రంగునాధం అన్నా రెండు చీట్లే కదా?' అన్నాడు. 'ఔను రెండు చీట్లే' అన్నాడు రంగనాథం. పత్రంపైన వేలిముద్ర వేసాడు రంగనాథం. అలా ప్రతి మాసం పూర్ణయ్యగారికి, రంగనాథంగారికి కాయగూరలు క్రమం తప్పకుండా సంవత్సరకాలం అందించాడు లక్ష్మణుడు. ఒకరోజు రంగనాథం ఇంటిముందు జనం గుంపులు గుంపులుగా ఉన్నారు. రంగనాథంతో, లక్ష్మణుడు తగాదా పడుతున్నాడు. 'నువ్వు నావద్ద పదివేల రూపాయల చీటి ఒకటి, వేయి రూపాయల చీటి ఒకటి వేసి ఇప్పుడు రెండూ పదివేల రూపాయల చీట్లు అంటావేమిటి? పదివేల రూపాయల చీటికి లక్షాఇరవైవేలు, వేయి రూపాయల చీటికి పన్నెండు వేలుకదా నీకు రావలసింది' అన్నాడు ఆవేశంగా రంగనాథం.

'అన్యాయం ప్రతిమాసం రెండు పదివేల రూపాయల చీట్లుకుగాను ఇరవై వేలరూపాయలు, కాయగూరలు, మీకు ఇచ్చివెళ్లాను' అన్నాడు లక్ష్మణుడు. అక్కడ ఉన్న జనంలో కొందరు 'అబ్బాయి అందుకు సాక్ష్యం ఉందా' అన్నారు. 'రంగనాథం గారు నాకు రాసి ఇచ్చిన పత్రం ఇదిగో' అన్నాడు లక్ష్మణుడు. లక్ష్మణుడు తెలివిగా రెండుచీట్లు పదివేల రూపాయలవని పత్రం రాయించుకొని తనను మోసం చేసాడు అనుకున్న రంగనాథం, వేరే దారిలేక అందరి ముందు లక్ష్మణుడికి ధనం ఇచ్చి పంపుతూ, చదువురాని వాళ్లని ఇంతకాలం తను మోసం చేస్తూ వచ్చాడు. నేను అదే చదువు రానితనం వలన తను మోసపోయాను విద్య విలువైనది అని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాడు. తన చదువుకు కొద్దిగ డబ్బు ఇచ్చిన రంగనాథం, చదువులేని తండ్రిని వేలిముద్రలు వేయించుకుని తమ పొలం స్వాధీన పరచుకున్నందుకు ఈవిధంగా గుణపాఠం చెప్పాడు లక్ష్మణుడు.



- డా॥బెల్లంకొండ నాగేశ్వరరావు

## చుక్కలు కలపండి



వార్త ఆదివారం

## బాలగేయం

### పూల మాలలు



చంద్రమ్మ తెచ్చింది
చేమంతి పూలు
గుర్రమ్మ తెచ్చింది
గులాబీపూలు
మల్లమ్మ తెచ్చింది
తెల్లని మల్లెలు
కనకమ్మ తెచ్చింది
సూదిదారాలు
పుల్లమ్మ కట్టింది
పూల మాలలు
పంతులమ్మ వచ్చింది
చదువుల తల్లికి
పూలమాల వేసింది
మేమంతా చక్కగా
చదవాలని
చదువుల తల్లికి మొక్కాము

**- చాడా మునిశేఖర్‌రెడ్డి**



## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి.మనోరమ,** కొత్తగూడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాటికన్ నగరమే ఒక దేశమని అంటారు. కారణాలేంటి?



**జవాబు: మనోరమ!** వాటికన్ సిటీ విస్తీర్ణం మన రాష్ట్ర రాజధాని విస్తీర్ణం కంటే తక్కువ. జనాభా ఏనాడూ ఇరవై వేలకు మించి వుండదు. ఇక్కడ ఎన్నికలనేవి జరగవు. పన్ను చెల్లింపులు అసలు వుండవు. సరిహద్దు ప్రమాదాలను నివారించడానికి ప్రత్యేక రక్షణ యంత్రాంగమూ లేదు. శాంతి భద్రతల విషయమై మాత్రం నామమాత్రంగా 'స్విస్ ఆర్మీ' పేరిట ప్రత్యేక వ్యవస్థ వుంది. ప్రపంచంలోని అతి సుందరమైన చర్చిల్లో ఒకటి ఇక్కడ సెయింట్ పీటర్స్ కెథడ్రల్ పేరుతో ఉంది. ఈ చర్చి నిర్మాణ సమయంలోనే ప్రపంచ క్రైస్తవులు రెండు వర్గాలుగా (ప్రొటెస్టెంట్స్, కేథలిక్స్) చీలిపోయారు. ప్రపంచ కేథలిక్ క్రైస్తవులకు ప్రతినిధి అయిన పోప్(తండ్రి అని భావం) ఈ సిటీలోనే స్థిర నివాసం ఉంటారు. వాటికన్‌ను సిటీ అని పిలుస్తున్నప్పటికీ ఇది నగరం కాదు. సర్వసత్తాక సార్వభౌమాధికారాలు ఉన్న ఒక దేశం. రాజ్యాంగం ఉంది. అంతర్జాతీయ సంస్థలలో దీనికీ సభ్యత్వం ఉంది. ప్రపంచంలో అతి సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న పదవులలో పోప్ పీఠం కూడా ఒకటి. పోప్ తన కార్యకలాపాలన్నింటినీ వాటికన్ సిటీ నుంచే దేశాధినేత తరహాలో నిర్వహిస్తుంటారు. ఎన్నికలు, పన్నుల వసూళ్లు మొదలైన అమాం బాపతు కార్యక్రమాలు లేకపోయినప్పటికీ 'వాటికన్ సిటీ' ప్రపంచ దేశాల సరసన 'దేశం' హోదాలోనే నిలబడిపోయింది. ఈ దేశ రాయబారి కార్యాలయం మన దేశంలోనూ ఉంది.





# సైబీరియా పక్షుల సందడి

**పక్షుల** గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. అయితే సీజనల్ పక్షులు ఆయా ప్రాంతాలకు, రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్తుంటాయి. తెలుగురాష్ట్రాల్లో పులికాట్ సరస్సుకు విదేశీపక్షులు వచ్చి, కొంతకాలం ఒక్కడ నివసిస్తాయి. మళ్లీ సీజన్ ముగిసిన తర్వాత వాటి స్వస్థలాకు వెళ్లిపోతుంటాయి. అయితే తేనిలాపురంలో ఏకంగా పక్షులకు సంబంధించిన ఒక మ్యూజియాన్నే ఏర్పాటు చేశారు.
పక్షుల ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే? చింత, రావి, తుమ్మ, గంధ్ర, వెదురుపై వాలే అతిథి విహంగాల జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే? ఎంత బాగుంటుందో కదా. ఆ సరదాను తీర్చడానికి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా, టెక్కలికి సమీపంలో తేలినీలాపురంలో పక్షుల మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఆహార అన్వేషణ, ఆవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతలను వివరంగా తెలియజేస్తూ పక్షుల బొమ్మలను ఏర్పాటు చేశారు.

**పెలికాన్:–** పెలికాన్ బాతు జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 8కిలోలు ఉంటుంది. దీని నోరు పొడవు సుమారు 14 సెంటీమీటర్లు. దీని రెక్కల పొడవు సుమారు 118 ఇంచీలు, రోజుకు 4 కిలోల చేపల్ని తింటుంది.



ఒకేసారి 2 కిలోల బరువు కలిగిన చేపను సునాయాశంగా తినగలిగే సామర్థ్యం ఉంది. దీని గుడ్డు బరువు సుమారు 150 గ్రాములు. ప్రతీ సీజన్‌కు 4 గుడ్లను మాత్రమే పెడుతుంది. దీని గుడ్డు 28 రోజుల్లో పిల్లగా పరిపక్వత చెందుతుంది.
– 3 నెలల్లో పిల్ల తల్లిగా మారుతుంది. దీని దవడ సంచి ఆకారంలో ఉంటుంది. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి.
– రోజుకు సుమారు 4సార్లు బయటకు వెళ్లా ఆహారాన్ని తీసుకువస్తాయి. పెలికాన్ దవడ సంచి ఆకారంలో ఉంటుంది. ఈ దవడలో సుమారు 4కిలోల వరకు చేపల్ని నిల్వ చేయగలవు. పిల్లలకు ఆహారాన్ని నోటి ద్వారా అందజేస్తాయి. దీని జీవితకాలం సమారు 29 సంవత్సరాలు.

**పెయింటెడ్ స్టార్క్**

పెయింటెడ్ స్టార్క్ కొంగ జాతికి చెందిన పక్షి. దీని బరువు సుమారు 5కిలోలు ఉంటుంది. దీని రెక్కలు పొడవు 63 ఇంచీలు. ఇవి చిన్న చేపలు, పురుగులు, నత్తలు తింటాయి. కేవలం పావుకిలో వరకు మాత్రమే నోటిలో ఆహారాన్ని నిల్వ చేయగలుగుతాయి. తీసుకువచ్చిన ఆహారాన్ని గూడు వద్ద వేస్తే పిల్లలు తింటాయి. దీని నోటి పొడవు సుమారు 16 సెంటీమీటర్లు. ఆహారం కోసం రోజుకు 2సార్లు బయటకు వెళ్తుంటాయి. దీనికి సాధారణ దవడ మాత్రమే ఉంటుంది. దీని గుడ్డు సుమారు 75గ్రాములు. ఇవి ఒక సీజన్‌లో 4 గుడ్లు మాత్రమే పెడతాయి. 28 రోజుల్లో గుడ్డును పిల్లగా పరిపక్వత చేస్తుంది. పిల్ల తల్లిగా మారాలంటే సూమారు మూడు సంవత్సరాల కాలం పడుతుంది. దీని జీవితకాలం సుమారు 29 సంవత్సరాలు.



**కొన్ని పక్షుల ప్రత్యేకతలు**

పొడుగు ముక్కు ఉల్లంకి: ఈ పక్షి మట్టిలో ఆహార అన్వేషణకు బురద మట్టి ఇసుక నేలలో అనేక రకాలైన చిన్న పురుగులను కొక్కెం వంటి ముక్కుతో వేట కొనసాగిస్తుంది. ఈ పక్షి నమూనా మ్యూజియంలో ఏర్పాటు చేశారు.

**తెడ్డు మూతి కొంగ:** ఈ పక్షి మూతి చెంచా ఆకారంలో ఉంటుంది. నీటి అడుగున ఉన్న చిన్న జీవులను వేటాడుతుంది. అర్థచంద్రాకారంలో గల మూతితో వేట కొనసాగిస్తుంది.

**పాము బాతు:** బల్లెం వంటి ముక్కు కలిగిన ఈ రాజహంస సూక్ష్మ జీవులను సునాయాశంగా వేటాడుతుంది. ఈ పక్షి ముక్కులో ఒక రకమైన వడపోత పరికరం బిగించి ఉన్నట్లు ఉంటుంది.

**నల్లగుల్ల కొంగ:** నత్తలను వేటాడడంలో ఈ పక్షి ముక్కు ఎంతో షార్ప్‌గా ఉంటుంది. నత్తలను గట్టిగా పట్టుకోవడంతో ఆహారాన్ని సంపాదించుకుంటాయి.

మ్యూజియం

టెక్కలి సమీపంలోని తేలినీలాపురంలో ఈ మ్యూజియం ఉంది. ఇది శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి 70కిలో మీటర్లు ఉంటుంది. సందర్శనీయ వేళలు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు.





# మేం కలిసే జీవిస్తాం!

**ఎంత** గొప్ప సంపాదనపరుడైనా, ఎంతగొప్ప మేధావి అయినా, ఎంత బలశాలియోనా కుటుంబ జీవితంతోనే ఎవరికైనా నిండుదనం వస్తుంది. ఒక వయసు వచ్చాక పెళ్లి చేసుకుని, జీవితంలో స్థిరపడాలని ప్రతివారూ భావిస్తారు. కానీ ఆధునిక కాలంలో చాలా జంటలు కలిసి జీవించేందుకు తగిన సర్దుబాటు చేసుకునేబదులుగా విడిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే రొమేనియా దేశం ఇందుకు విరుద్ధం. రొమేనియాలో బీర్టాన్ అనే ఓ చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఒక చర్చి, ఆ చర్చికి దగ్గర్లో 'మారిటల్ ప్రిజన్' పేరుతో పిలిచే ఒక చిన్న ఇల్లుంది. మనస్పర్థలతో, తరచూ గొడవలతో విడాకులు తీసుకోవాలను కుంటున్న దంపతులు "మాకు విడాకులు ఇప్పించండి" అని ఇక్కడి బిషప్‌ను కలుస్తుంటారు. విడాకులు కావాలని అక్కడికి వచ్చిన దంపతులను ఆయన చర్చి ఆవరణలో ఉన్న ఇంట్లో వారిని వదిలి బయట నుండి గడియ పెట్టేస్తారు. రెండు నుంచి ఆరు వారాల పాటు దంపతులను బయటకు రానీయకుండా అందులోనే ఉంచుతారు. అందులో నుంచి వచ్చిన తరువాత వారు ఆశ్చర్యంగా "మాకు విడాకులు వద్దని, మేం కలిసిపోయామని, మా మధ్య ఎలాంటి మన స్పర్థలు లేవని" చెబుతారు. గత మూడు వందల ఏళ్లలో ఎన్నో జంటలు ఈ ఇంట్లోకి వెళ్లగా, ఒకే ఒక జంటకు విడాకులు లభించాయంటే 'మారిటల్ ప్రిజన్' గొప్పదనం అర్థం చేసుకోవచ్చు.



**అన్నీ పంచుకోవాల్సిందే..**

చర్చికి దూరంగా కొండపైన ఉంటుంది 'మారిటల్ ప్రిజన్'. ఇండిపెండెంట్ ఇల్లే అయినా ఒకే గది ఉంటుంది. అందులో ఒక కుర్చీ, ఒక టేబుల్, ఒక బెడ్ ఉంటాయి. ఒకే దిండు, ఒకే దుప్పటి ఉంటాయి. ప్లేట్, స్పూన్ కూడా ఒక్కటే ఉంటుంది. అందులోకి వెళ్లినవారు అన్నింటినీ షేర్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆహారం తయా రు చేసుకోవడానికి కష్టమవుతుంది. అందుకే ఆ ఇంట్లోకి వెళ్లిన దంపతులు ఈ జైలులో (గది అయినప్పటికీ) ఉండేకన్నా బయటకు వెళ్లి కలసి ఉందామని నిర్ణయించుకుంటారట. "సాధారణంగా భార్యాభర్తలు గొడవ పడటానికి, విడిపోవాలనుకోవటానికి ప్రధాన కారణం వారి మధ్య ప్రేమ లేకపోవడమే. జీవించాలనే భయం ఉంటే క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న ఇద్దరు వ్యక్తులు కలిసిపోతారు. అలాంటి పరిస్థితి ఇక్కడ ఏర్పడు తుంది కాబట్టి సాధారణం గానే విడాకులు వద్దనుకుంటారు" అని అక్కడి బిషప్ లు చెబుతారు. అందుకే స్థానికులు దీన్ని 'మారిటల్ ప్రిజన్' అని పిలుస్తారు. కొందరు రెండు వారాల్లో కలిసిపోతే; మరికొందరికి ఆరు వారాల సమయం పడుతుందం టున్నారు అక్కడి బిషప్. పెళ్లి కష్టాల నుంచి బయట పడేయ మని ఇప్పటికే కొన్ని జంటలు చర్చికి వస్తుంటాయట. అలాంటి వారంతా ఈ జైలు జీవితాన్ని చవిచూశాక తమ నిర్ణయాన్ని మార్చుకోకుండా ఉండలేరు. అయితే ప్రస్తుతం ఈ జైలు మ్యూజియంగా మారింది.



కథ

# సంకల్ప బలం

ఎన్.డి.ఎస్.వి.నాగేశ్వర రావు

**“వసుధా మేడం, నన్ను క్షమించండి. మీ గొప్పతనం తెలుసుకోలేక పొరపాటున మాట జారాను. ఆ సంగతి తెలిసినా, మీరు అదేమీ పట్టించుకోకుండా ఈరోజు నా ఉద్యోగాన్ని కాపాడారు. ఏం చేస్తే మీ ఋణం తీరుతుంది”.**

“రమణగారూ! ప్రతివారు తెలిసో తెలియకో తప్పులు చేస్తారు. మనకి చేతనైన సహాయం చేయాలి తప్ప అలాంటి మాటలు అన్నీ పట్టించుకోనవసరం లేదు. ఈరోజు మీ ఉద్యోగం నిలబడింది, ఆ తృప్తి చాలు నాకు”.

పక్కనే నిలబడి వింటున్న రవికి సంతోషం, బాధ రెండూ ఒకేసారి కలిగాయి. అది ఎందుకో తెలియాలంటే రెండేళ్ల వెనక్కి వెళ్లాలి.

.........

ప్రమోషన్ మీద రెండేళ్ల క్రితం రవి ఆ ఆఫీస్‌కి వచ్చాడు. అప్పటికే ఆ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. దాంతో సీనియర్ అయిన రమణ ఆఫీస్ మేనేజర్‌గా చేస్తున్నాడు. కొత్త బాస్ రావడం అతనికి ఇబ్బందిగానే ఉంది. కానీ బాస్ అంటే బాసే. అందుకే రవి చేరినప్పటి నుంచి ఆఫీసులో ఎలాగైనా అతని ప్రాపకం సంపాదించాలని చాలా ప్రయత్నాలు చేయసాగాడు రమణ.



అందులో భాగంగానే ఒకరోజు ఆఫీస్ విషయాలు వివరిస్తూ “సార్! మీరు ఆ వనజకి మెటర్నిటీ లీవు సాంక్షన్ చేసారు. ఏం చేస్తాం, తప్పదు. ఆవిడ పని తొమ్మిది నెలలో, సంవత్సరమో మనమే చేసుకోవాలి. అది ఒక ఎత్తైతే, ఇప్పుడు కొత్త వార్త.

వసుధకి కేన్సర్ వచ్చిందట. ఇంక ఆ పోస్ట్ సంగతి మర్చిపోవడమే. కేన్సర్ వచ్చినవాళ్లు ఎవరైనా బతికి బట్ట కట్టారా? ఇంక రేపటి నుంచి ఆవిడ సెలవు మీద పోతుంది. ఇక తిరిగి వచ్చేదేముంది లెండి...” అని ఇంకా ఏదో మాట్లాడబోతున్న రమణని కోపంగా చూస్తూ ఆపాడు రవి.

“చూడు రమణా! నీ వ్యవహారం ఏమీ బాగాలేదు. తోటి ఉద్యోగుల గురించి, అందునా మహిళా ఉద్యోగుల గురించి ఇలా మాట్లాడటం తప్పు. నీకు సంస్కారం లేదా? రేపు మీ కుటుంబ సభ్యుల గురించి ఎవరైనా ఇలాగే అంటే నీకు ఎలా ఉంటుంది? అదే కేన్సరు నీకు వస్తే ఇలాగే మాట్లాడగలవా? ఇకమీదటైనా నీ ప్రవర్తన మార్చుకో. లేదంటే సిబ్బంది గురించి ఇలా చులకనగా మాట్లాడితే నేనే నీ మీద డిపార్ట్‌మెంట్ పరంగా చర్యలు తీసుకుంటాను”.

“సరే సార్! ఏదో వున్న విషయం చెప్పాను. మీరు అలా మాట్లాడితే నేనేం చేయగలను? సారీ సార్!” అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు రమణ.

రవి వసుధ గురించి ఆలోచిస్తున్నాడు. తన దగ్గర ఉన్న సమాచారం ప్రకారం వసుధకి సంస్థలో చాలా మంచి పేరు. పని బాగా చేస్తుందనీ, ఒకసారి పని అప్పజెప్పితే పూర్తయ్యేదాకా మనం దాని గురించి ఆలోచించవలసిన అవసరం లేదనీ, ఆమెతో పని చేసినవాళ్లు, ఆమెను చూసినవాళ్లు అందరూ చెప్పారు. అలాంటి మంచి వ్యక్తికి కేన్సర్ వచ్చిందంటే చాలా బాధగా అనిపించింది రవికి.

వెంటనే వసుధని తన గదికి రమ్మని పిలిచాడు. కూర్చోబెట్టి ఆఫీసు విషయాలు అడుగుతూ “అమ్మా! మీ సొంత విషయాల్లో కల్పించుకుంటున్నానని అనుకోకపోతే ఒక మాట. నిజానికి ఈ ఆఫీసు మేనేజరుగా, నా తోటి ఉద్యోగుల బాగోగులు తెలుసుకోవడం నా బాధ్యత. ఆ ఉద్దేశంతోనే అడుగుతున్నాను. నీకు ఒంట్లో బాగోలేదని తెలిసింది, అది ఎంతవరకు నిజం?

అప్పటివరకు ఆఫీసు విషయాలు గడగడా మాట్లాడుతున్న వసుధ మొహం ఒక్కసారిగా పాలిపోయింది. వెక్కి వెక్కి ఏడుస్తూ “నిజమే సార్! నాకు కొద్ది రోజులుగా ఒంట్లో బాగోలేదు. డాక్టర్ దగ్గరికి వెళ్లి పరీక్షలు చేయించుకుంటే ఒవేరియన్ కేన్సర్ సెకండ్ స్టేజ్‌లో ఉందని చెప్పారు.

ఏం చేయాలో తోచడం లేదు. ఆఫీసుకు రాకపోవడం నా సర్వీస్‌లో ఎప్పుడూ జరగలేదు. ఇప్పుడు త్వరలోనే శాశ్వతంగా ఆఫీసుకి, అలాగే కొంత కాలంలో శాశ్వతంగా ఈ లోకానికి దూరమవుతానని నాకు అర్థం అవుతోంది. ఇంట్లోవాళ్లు కూడా చాలా హైరానా పడుతున్నారు.

ఇంట్లో ఉంటే వాళ్ల బేలతనం, బాధ తట్టుకోలేక ఆఫీసుకి వచ్చేసాను. కానీ ఎన్ని రోజులు ఇలా రాగలనో తెలియడం లేదు”.

“అమ్మా వసుధా! ఇది నిజంగానే బాధాకరమైన విషయం. కానీ ఒక్క మాట చెప్పదలిచాను.

కేన్సర్ ప్రాణాంతకమే, కాదనను. ఎనభై ఏళ్ల వయసులో మా నాన్నగారు ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణించారు. అయితే ఆయన మరణం వ్యాధి కన్నా వయసువల్లే అని డాక్టర్లు అన్నారు. కానీ ట్రీట్‌మెంట్ తీసుకుంటే బతికి బాగున్న వాళ్లని నేను చాలా మందిని చూసాను. అంతవరకు ఎందుకు, మన టాప్ మేనేజ్‌మెంట్‌లో ఉన్న భారతి మేడం ఇలాగే కేన్సర్ బారిన పడి, సరైన ట్రీట్‌మెంట్ తీసుకోవడం వల్ల కోలుకున్నారు.

ఆమె ఎప్పట్లాగే పని చేస్తున్నారు. అలాగే నీ వయసు రీత్యా మనస్థైర్యం పెంచుకొని, సరైన ట్రీట్‌మెంట్ తీసుకుంటే నువ్వు ఎప్పటిలాగే నీ జీవితం కొనసాగిస్తావని నాకు నమ్మకం ఉంది. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ ధైర్యం కోల్పోకుండా సరైన ట్రీట్‌మెంట్ తీసుకో. ఎలాగూ మన సంస్థ ఇలాంటి విషయాల్లో ఉద్యోగస్తులకు సాయం చేస్తుంది. కావలసిందల్లా నీ మనోనిబ్బరం".

"మీరు చెప్తుంటే చాలా ధైర్యం వస్తోంది సార్. కానీ సెలవు పెట్టి ఇంటి దగ్గర కూర్చుని మిగతా కుటుంబ సభ్యుల జాలిచూపులు తట్టుకోలేను. అలాగని ఆఫీసుకి రాగలనో, లేదో తెలియదు".



"అమ్మా! వసుధా!! నీకు పని మీద శ్రద్ధ ఉందని నాకు తెలుసు. ఇన్నేళ్లు సంస్థ కోసం ఎంతో కష్టపడ్డావు. నీకు అవసరం వచ్చినప్పుడు సంస్థ కూడా అలాగే సాయం చేస్తుంది. మెడికల్ లీవు ఎలాగూ లభిస్తుంది. అంతేకాకుండా నేను ఇక్కడ ఉన్నంత కాలం నీకు కావలసిన విధంగా ఆఫీసుకి రావడానికి, ఏ సమయంలో వచ్చినా ఇబ్బందిగా ఉన్నా, ఇంటికి వెళ్లిపోవడానికి నేను పర్మిషన్ ఇస్తున్నాను. నీ వీలు ప్రకారం వచ్చి పని చేసుకో. లేదంటావా, ఇంటి దగ్గర తేలికగా చేయగలిగే పని నీకు అప్పజెప్తాను. ఆ రకంగా నీ మనసుకు కూడా కాస్త స్వాంతన కలిగి, ఆరోగ్యం బాగుపడటానికి వీలు అవుతుంది".

"థాంక్యూ సర్! మీరు నా మీద ఇంత శ్రద్ధ తీసుకున్నందుకు చాలా సంతోషం. మీరు అన్నట్టుగా నేను యుద్ధం చేస్తా. నా సంకల్ప బలం ఎంచుకుని, ఎలాగైనా ఈ మహమ్మారి నుంచి బయటకు వస్తాను. ట్రీట్‌మెంట్ వల్ల ఏమాత్రం డీలా పడినా, మీ మాట సాయం నాకు కావాలి".

"తప్పకుండా.. ఆ సాయం నేను ఎప్పుడూ అందిస్తా" అన్నాడు రవి.

.........

కొన్ని నెలలు గడిచాయి. వసుధకి ఆపరేషన్ చేసి ఓవరీస్ తొలగించారు. తరువాత వసుధ చాలా ధైర్యంగా కీమోథెరపీ కూడా తీసుకుంది. దాని దుష్ప్రభావాలు చాలానే వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొంది. ఆపరేషన్ సమయంలో సెలవు తీసుకున్నా తరువాత నుంచి ఒక వారం ట్రీట్‌మెంట్ తీసుకుని, ఒక వారం ఇంటి నుంచి పని చేస్తూ, మరో వారం ఆఫీసులో పని చేస్తూ అలాగే కాలాన్ని నెట్టుకొచ్చింది. ఆరోగ్యం పూర్తిగా కుదుట పడకపోయినా కచ్చితంగా మార్పు కనిపించింది.

ఈ లోపల ఆఫీసులో జరిగిన ఒక ఆడిట్లో రవి జాయిన్ అవడానికి ముందు నాలుగు నెలల కాలంలో కొన్ని రికార్డులు గల్లంతయ్యాయని, దానివల్ల రమణ మీద డిసిప్లినరీ యాక్షన్ తీసుకోవడానికి సంస్థ సిద్ధపడింది. ఆ విధంగా రికార్డులు గల్లంతయ్యాయని నిరూపించబడితే రమణ ఉద్యోగం పోయే అవకాశం ఉంది. పని మీద రమణకి సరైన అవగాహన లేకపోవడం,రికార్డులు సరిగ్గా నిర్వహించకపోవడం అన్న లోపాలు తప్పితే వ్యక్తి పరంగా మోసం చేసే తత్వం లేదు అని ఆఫీసులో వున్న వారందరికీ తెలుసు. కానీ అతన్ని ఎలా కాపాడాలో ఎవరికీ తెలియలేదు.

అలాంటి సమయంలో ఒకరోజు వసుధ రవి దగ్గరకు వచ్చింది. "సార్! రమణగారు ఏ తప్పూ చేయలేదు అని నాకు అనిపిస్తోంది. మీరు ఒక పది రోజులు నాకు అవకాశం ఇస్తే, పాత రికార్డులన్నీ వెతికి, మళ్లీ రికార్డులు తయారు చేస్తాను. దాంట్లో ఏ తప్పూ దొరక్కపోతే రమణగారి ఉద్యోగం నిలబడుతుంది. ఆ ప్రయత్నం చేసే అవకాశం నాకు ఇవ్వండి".

"థాంక్యూ సర్! మీరు నా మీద ఇంత శ్రద్ధ తీసుకున్నందుకు చాలా సంతోషం. మీరు అన్నట్టుగా నేను యుద్ధం చేస్తా. నా సంకల్ప బలం ఎంచుకుని, ఎలాగైనా ఈ మహమ్మారి నుంచి బయటకు వస్తాను. ట్రీట్‌మెంట్ వల్ల ఏమాత్రం డీలా పడినా, మీ మాట సాయం నాకు కావాలి".

"అమ్మా వసుధా! నీ ఆరోగ్యం ఏం బాగోలేదు. ఈ సమయంలో ఇంత కష్టమైన పని చేయడం అవసరమా? ఒకసారి ఆలోచించు" అన్నాడు రవి.

"సార్! అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను. నాకు ఒక అవకాశం ఇవ్వండి" అంది వసుధ.

.........

గత జ్ఞాపకాల నుంచి బయటకు వచ్చాడు రవి. వసుధ పది రోజులు కష్టపడి రికార్డులన్నీ వెరిఫై చేసి మళ్లీ అన్నీ సక్రమంగా రాయడంతో రమణ ఏ పొరపాటూ చేయలేదని నిరూపించగలిగారు. దాంతో రమణ ఉద్యోగం నిలబడింది.

మహిళా శక్తి తలచుకుంటే ఏదైనా చేయగలరని వసుధ మరోసారి నిరూపించింది.

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. sunmagvaartha@gmail.com

## డా॥ పులివర్తి కృష్ణమూర్తి

# వినమ్రత ఒక అద్భుత గుణం

మహాభారతాన్ని పంచమ వేదంగా భావిస్తూ వున్నాం. ఈ గ్రంథంలో మానవ సంబంధాలకు సంబంధించిన కథలెన్నో వున్నాయి. అవి అద్భుతమైన సందేశాలను అందిస్తాయి.

ఒకసారి సముద్రుడు నదులతో సమావేశమై ఒక ప్రశ్న అడిగాడు "నదులారా, మీరు వరదలతో వేగంగా ప్రవహించేటప్పుడూ కొండల మీది నుండి దూకేటప్పుడు పెద్ద పెద్ద చెట్లను పడగొట్టేస్తారు. ఊళ్లకు ఊళ్లు ముంచెత్తుతారు. కానీ ఈ అల్పమైన తుంగమొక్కలు మాత్రం చెక్కుచెదరకుండా అలాగే ఉంటున్నాయి. వాటిని మీరు ఎందుకు కదిలించలేకపోతున్నారు?" అని అడిగాడు. అప్పుడు గంగానది వెంటనే అన్ని నదుల పక్షాన ఇలా అంది "మేం వేగంగా ప్రవహించేటప్పుడు కొండలూ, చెట్లూ అహంకారంతో మాకు అడ్డుగా నిలుస్తాయి. అందువలన మేం మా బలాన్ని చూపించి వాటిని పడగొట్టేస్తాం. తుంగ వంటి మొక్కలు స్వాగతం చెబుతూ వినయంతో తలలు వంచుతాయి. కనుక మేం వాటి మీదుగా ప్రవహించి నీ దగ్గరకు చేరుకుంటాం. తర్వాత అవి తల ఎత్తి మునుపటిలాగా బతుకుతాయి. అంతేతప్ప మాకు వాటి మీద ప్రత్యేకంగా ఎలాంటి ప్రేమా లేదు" అంది గంగమ్మ. భీష్మ పితామహుడు ఈ విషయాన్ని ధర్మరాజుకి తెలియచేశాడు. శత్రువు బలవంతుడైనప్పుడు, బలహీనుడైనవాడు ఎలాంటి ఉపాయంతో తప్పించుకోవాలో వివరించాడు. ప్రహ్లాదుడి కథ మనం వినే వుంటాం. ప్రహ్లాదుడి తండ్రి హిరణ్య కశిపుడు, తన కొడుకు ఎలా చదువుతున్నాడో తెల్సుకోవాలని అనుకున్నాడు. ప్రహ్లాదుణ్ణి ప్రశ్నించాడు.



గురువులు బాగా చదివిస్తున్నారంటాడు. ఎన్నో ధర్మ శాస్త్రాలను చదివానని అంటాడు. శ్రీహరిని స్మరించటం మేలు అని చెప్పిన ప్రహ్లాదుడిపై తండ్రి ఎంతగానో ఆగ్రహిస్తాడు. కానీ ప్రహ్లాదుడు ఎంతో వినమ్రతతో పద్మనాభుని దివ్య పాదార విందాలను దర్శిస్తూ స్వామి ధ్యానామృతాన్ని గ్రోలి చిత్తము ఇతర విషయాల పైకి పోవట్లేదంటాడు. హిరణ్య కశిపుడు ప్రహ్లాదుడికి విద్య నేర్పిన గురువులను తప్పు పడతాడు.

అందుకు ఆ బాలుడు **"చదివివించిరి నన్ను గురువులు సదివితి ధర్మార్థ ముఖర శాస్త్రంబులు, నే చదివినవి గలవు పెక్కులు చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ"** అంటూ అంతే వినయంగా చెబుతాడు. శ్రీహరిని పూజించే చేతులే చేతులు, శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుక, శ్రీపతిని చూసే చూపులే చూపులు, శేషసాయికి మొక్కే శిరస్సే శిరస్సు, విష్ణుకథలను వినే చెవులే చెవులు, మధుసూదనుని తలంచే మనస్సే మనస్సు. ఇలా చెబుతూ చక్రధారిని గురించి తెలియజేసే చదువు చదువు, గోవిందుని గురించి బోధించే గురువే గురువు, శ్రీహరిని చేరవలెనని చెప్పే తండ్రియే తండ్రి సుమా!" అంటూ ఆనందాతిరేకంతో తండ్రికి చెప్పిన తీరు అద్భుతం. వినమ్రతతో అద్భుతమైన విశ్లేషణ ఇస్తాడు ప్రహ్లాదుడు. ఎంతో జ్ఞాన సంపదతో వారికి అత్యంత సన్నిహితుడైన ప్రహ్లాదుడు తన తండ్రి ఎంతటి ఘోరమైన శిక్షలు విధించినా ఏమాత్రం కోపగించుకోకుండా అంతే వినయంతోనూ, గౌరవంతోనూ తాను నమ్మిన విషయాన్ని పదే పదే చెప్పే ప్రయత్నం చేసాడు.

రాక్షసులు రెచ్చిపోయి తనను చిత్రహింసలు పెడుతుంటే మాటి మాటికీ "ఓ పన్నగశాయీ, ఓ జగదీశా, ఓ దీనశరణ్యా, ఓ పరమపావనా! అంటూ భగవంతుని వినమ్రంగా స్తుతిస్తూనే వున్నాడు. కన్నుల నీరు తెచ్చుకోడు, భయంపితుడు కాడు, కోపం తెచ్చుకోడు. ఎవరి పైనా మనస్సు కష్టపెట్టుకోడు. ఎవ్వరినీ ద్వేషించడు.

పైగా తండ్రికి ఎంతో ప్రేమగా, వినమ్రంగా తనలో వున్న ఆరురురు భయంకర శత్రువులను తొలగిస్తే ప్రాణికోటిలో తనకు ఒక్క విరోధి వుండడు. వివేకంతో నీవు విషయంను గ్రహింపవల్సి ఒదని వేడుకుంటాడు. **"ఇందుగలడందులేడనే సందేహామే వద్దంటూ"** శ్రీహరి దర్శనాన్ని నరసింహావతారంగా ఆవిర్భవింపజేసి తండ్రికి ముక్తిని చేకూర్చాడు. అంతేగానీ ప్రహ్లాదుడు ఏమాత్రం కోపాన్నిగానీ, అహంకారాన్నిగానీ ప్రదర్శింపలేదు. ◆

**సరదా రచనలకు ఆహ్వానం**

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు, పంచ్ డైలాగులు వగైరాలు పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం. దయచేసి కాపీ రచనలు పంపకండి. మీ రచనలు పంపించవలసిన చిరునామా:

నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

sunmagvaartha@gmail.com

# దాశరథి 'అగ్నిధార'

జయసూర్య

తిరుగుబాటు పోరాటాలకు పురిటిగడ్డ వీరభూమి తెలంగాణలో, 1948లో నిజామాబాదు జైలులో ఒక చరిత్రాత్మక సంఘటన సంచలనం కలిగించింది. నిజాం నిరంకుశ పాలన సృష్టిస్తున్న రాజ్యాధికార ఉన్మాదంపై తెలంగాణ యువత కవితా పరంగా అగ్నిసెగలు రగిలిస్తున్న రోజులవి. మహాకవి దాశరథి నైజాం, దురహంకార అణచివేతల కారణంగా సుమారుగా ఇరవై ఏళ్ల వయస్సులో జైలు పాలయ్యారు. మరో ముప్పై మంది ఖైదీలతో వరంగల్లు జైలు నుంచి నిజామాబాద్ జైలుకు దాశరథిని కూడా తరలించారు.

దాశరథి జైలు గోడ మీద బొగ్గుతో రాసిన పద్యం..

**"ఓ నిజాము పిశాచమా?<br>కానరాడు<br>నిన్ను బోలిన రాజు<br>మాకెన్నడేని,<br>తీగెలను తెంపి అగ్నిలో<br>దింపినావు<br>నా తెలంగాణ, కోటి<br>రత్నాల వీణ"**



మరొక విప్లవ యోధుడు వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి రాసిన పద్యాన్ని కంఠస్థం చేసి తరచు వినిపించేవారు. జైలు అధికారులు ఆగ్రహావేశంతో ఒక గోడపై రాసిన వున్న పద్యాన్ని చెరిపినప్పుడల్లా మరునాడు మరో గోడ మీద ప్రత్యక్షమయ్యేది. ముందు దాశరథే ఆ విధంగా మళ్లీ రాస్తున్నాడని జైలు అధికారులు అనుమానించినా, ఆళ్వారుస్వామి రాస్తున్న విషయం పసిగట్టారు. ఆళ్వారును గుల్బర్గా జైలుకు, దాశరథిని చంచల్‌గూడా జైలుకు మార్చివేశారు. ఆ విధంగా వారిద్దరు మూడు నెలలు మాత్రమే కలిసి, సన్నిహితులయ్యారు. అనంతరం 1949లో 'సాహితీమేఖల', అచ్చువేసిన 'అగ్నిధార' ఖండకావ్య సంపుటిని, ప్రజల మనిషి ఆళ్వారుస్వామికి, దాశరథి అంకితమివ్వటం దాశరథి మహోన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం. అగ్నిధారలోని ఖండికలు, యించుమించుగా దాశరథి జైలు జీవితంలో రాసినవే. నాటి నైజాం ప్రభుత్వ దుష్టత్వం, జన సామాన్యపు మానసిక శారీరక వేదన, ప్రాణాలు లెక్కచేయని సాహసం, ఉత్తేజం, పోరుబాట స్వాతంత్ర్యోదయం, సైనిక చర్య, నైజాం పతనం.. యివన్నీ అగ్నిధార కవితా ఖండికలకు పునాదులు.

1962లో చందా నారాయణ శ్రేష్ఠి ప్రచురణాలయం అగ్నిధార ద్వితీయ ముద్రణను వెలువరించింది. తొలిపలుకులో దేవులపల్లి రామానుజరావు, కాలపు కరకు రాపిడికి తట్టుకొని వన్నెలు తిరినది 'అగ్నిధార' కావ్యం అంటారు. ఈ చిరుకబ్బము గాయపడిన కవి గుండెలలో నుంచి వచ్చిన కవితా శరాలంటారు దేవులపల్లి.




తెలుగు సాహిత్యంలో అగ్నిధార, విప్లవాత్మక విద్యుత్ కావ్యం. 'రైతుదే!' అనే ఖండికలో, దాశరథి కవితా హృదయం యిల్లా ఘోషిస్తుంది.

**"ప్రాణములొడ్డి ఘోర గహ<br>నాటవులన్ బడగొట్టి<br>మంచి మా<br>గాణములన్ సృజించి<br>ఎము<br>కల్ నుసి జేసి పొలాలు దున్ని భో<br>షాణములన్ నవాబునకు<br>స్వర్ణము నింపిన రైతుదే, తెలం<br>గాణము రైతుదే; ముసలి<br>నక్కకు రాచరికంబు దక్కునే?"**

అంటూ నా తెలంగాణ, కోటి రత్నాల వీణ అంటారు మరొక 'జైల్లో' అనే కవితలో–

**"ఇట వసంతము లేదు. సహింపరాని<br>గ్రీష్మ హేమంత కాల కాళికలెగాని:<br>ఇట ఉషస్సులు లేవు: భరింపరాని<br>అంబు వాహ సందోహ నిశాళికాని.<br>వెన్నెలలు లేవు. పున్నమ కన్నె లేదు.<br>పైడి వన్నెల నెలవంక జాడ లేదు.<br>చుక్కలే లేవు, ఆకాశ శోక వీధి<br>ధూమధామమ్ము, దుఃఖ సంగ్రామ భూమి**

అంటారు వేదనాయుత హృదయంతో.

'ముస్సీ తటాకం' శీర్షికలోని ఖండికలో–

**"నా తెలంగాణ కోటి రత్నాల వీణ<br>తీవియలు తెగి, విరిగి నదించకుండె<br>నా తెలుగు జాణ ప్రాణమానాలు దోచి<br>ఈ నిజాము పిశాచి కన్నెర్ర చేసె"**

అంటారు.

1963లో దాశరథి, 'పురాస్మృతులు' పేరిట రాసిన పీఠికలో తొలి ముద్రణ చేయించిన సాహితీ మేఖలకు, దేవులపల్లి రామానుజరావు, పులిజాల హనుమంతరావులకు కృతజ్ఞతలు వ్యక్తం చేసారు. అగ్నిధార ఖండకావ్యంలో శృంగార, వీర రసాలు వస్తు వైవిధ్యంగా 50 ఖండికలున్నాయి. ప్రధానంగా నాడు అగ్నిగుండంగా ప్రజల ప్రాణమానాలు, నైజాం రాచరికపు ఆధిపత్య దాహానికి ఆహుతి అవుతున్న రాజకీయ నేపథ్యంలో, దాశరథి ప్రజాభ్యుదయ కవిగా అగ్ని సంకేతంగా నిప్పులు వర్షింపచేసాడు. అగ్నిధారలో అణుమాత్రమైనా కాల్పనికత, అవాస్తవికతకు చోటు లేదు. అగ్నిధారను ప్రవహింపచేసే అక్షర ప్రబోధంతో నరాలలో, మెదడులో తిరుగుబాటు, పీడిత ప్రజల వాణిని నిప్పుకణికలుగా వెదజల్లాడు. దౌర్జన్యం, అన్యాయం, అక్రమం, అణచివేతలపై శక్తివంతంగా ఒక చారిత్రక పరిణామానికి సజీవమైన కావ్యరూపం భాసింపచేసారు. 'అగ్నిధార'తో ఆరంభమైన దాశరథి కవితా ఝరి తెలుగు సాహిత్యంలో అమృతధారలను సృష్టించింది. ఆఖరి కవిత 'పదే పదే అనేస్తా'లో– **"దగాకోరు బటాచోరు**

**రజాకారు పోషకుడవు<br>చరిత్ర బొంగరం తిరిగి<br>కిరీటాలు నేలకొరిగి<br>ధరాధిపులు నశిస్తుంటే<br>బరాయెనాం నవాబా!<br>పరాక్రమం చూపేవా?<br>దిగిపొమ్మని జగత్తంత<br>నగారాలు కొడుతున్నది.<br>దిగిపోవోయ్ తెగిపోవోయ్<br>తెగిపోవోయ్ దిగిపోవోయ్<br>ఇదే మాట ఇదే మాట<br>పదే పదే అనేస్తాను"**

పునరుజ్జీవ తెలంగాణ అస్తిత్వంలో దాశరథి కవితా స్వరం ప్రతిధ్వనిస్తోంది.

# నలుగురు పిల్లలు

యామిజాల జగదీశ్

ఆయన ఓ ఆధ్యాత్మిక వక్త. ఒకరోజు ఆయనను అనుకోకుండా కలిసాను. అప్పుడు ఆయన నాకు ఏ సంబంధం లేని ప్రశ్న అడిగారు. అదేంటంటే–

"దశరథుడికి ఎందుకు నలుగురు పిల్లలు పుట్టారు?" అని.

"నాకేం తెలుసండీ? అది దశరథుడిని మీరు అడగవలసిన ప్రశ్న" అని నెమ్మదిగానే చెప్పాను.

"దశరథుడు అడిగింది ఒక కొడుకునే" అన్నారాయన.

"అలాగా" అన్నాను.

"అవును.." అన్నారాయన. తన తదనంతరం రాజ్యాన్ని పాలించడానికి తాను సద్గతి పొందడానికి దోహదపడుతుందని దశరథుడు అడిగింది ఒక్క కొడుకునే. అలాగే దేవతలు అడిగిందేమో రావణుడిని వధించడానికి ఒక రాముణ్ణి.

అటువంటప్పుడు ఎందుకు నలుగురు పిల్లలు..

దీనికి జవాబుగా ఆయన వివరించి చెప్పారు.

ఈ ప్రపంచంలో నాలుగు రకాల ధర్మాలు ఉన్నాయి. ఆ నాలుగు ధర్మాలు అనుసరించి రాజ్యంలోని ప్రజలకు చూపాలని ఆ నలుగురు సోదరులు పుట్టారు. అంతేకాకుండా రావణుడిని వధించేందుకు కాదు.. అన్నారు.

అదేమిటీ, నాలుగు రకాల ధర్మాలు..?


మొదటిది.. సామాన్య ధర్మం. అదేమిటంటే– పిల్లలు కన్నతల్లిదండ్రుల వద్ద ఎలా నడచుకోవాలో అని.

శిష్యుడు గురువు దగ్గర ఎలా నడచుకోవాలి.. భార్య భర్త దగ్గర ఎలా నడచుకోవాలి.. ఇటువంటివన్నీ సామాన్య ధర్మాలు. ఇవన్నీ అనుసరించి చూపించినవారు రాముడు. సామాన్య ధర్మాలను సక్రమంగా అనుసరిస్తే చివరికి ఓ స్థితి వస్తుందట. ఆ స్థితిలో భగవంతుడి పాదపద్మాలే శరణ్యం. అది నిరంతరం. కృష్ణలీలా తరంగిణి రచయిత కలువపువ్వుల్లాంటి నీ పాదాలను చుట్టూ తిరిగే భ్రమరంలా నేనుండాలి అని కోరుకున్నారట.

ఇటువంటి ధర్మానికి శేష ధర్మం అని పేరు. దీనిని అనుసరించి చూపిన వారున్నారు. వారిలో ఒకడు లక్ష్మణుడు.

సరే, మూడవది ఏమిటీ.... విశేష ధర్మం. అంటే దూరాన ఉంటూ ఎప్పుడూ భగవంతుడి వ్యాపకమే ఉండటం. శేష ధర్మం కన్నా విశేష ధర్మం కఠినం. భగవంతుడికి పక్కనే ఉంటూ అతని ధ్యాసలోనే ఉండటం కష్టం కాదు. కానీ దూరాన ఉంటూ అతనిని స్మరించడం అనేది ఒకింత కష్టమే. అలా అనుసరించి చూపించినతను భరతుడు.

ఇక నాలుగవ ధర్మం విషయానికి వస్తే ఇందుకు ఉదాహరణగా శత్రుఘ్నుడిని చెప్పుకోవచ్చు. అదెలాగంటే– ఈ నాలుగో ధర్మంలో భగవంతుడి కన్నా అతని దాసులకు సేవ చేయడమే ఆ ధర్మం.



దీనిని అనుసరించి చూపించినతను శత్రుఘ్నుడు. అందుకే భరతుడిని విడవకుండా వెంటే ఉంటూ అతని సేవ చేస్తూ వచ్చాడు శత్రుఘ్నుడు.

ఈ విధంగా నాలుగు రకాల ధర్మాలను అనుసరిస్తూ ప్రజలకు చూపించడానికే భగవంతుడు నాలుగు అవతారాల్లో ఆయన మరికొన్ని విషయాలు కూడా చెప్పారు.

కృతము అంటే చేయబడినది. దీనినే సత్యయుగము అని కూడా అంటారు. అంటే ఇక్కడ మనం ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలి, ధర్మం చేయాలి అని ఎవరూ మనకు చెప్పక్కరలేదు. మనమే తప్పనిసరిగా చేయాలి అనుకొని ధర్మం చేయాలి. ఇక్కడ ధర్మం చేయడం అనేది ఓ స్వభావం.

సహజంగా ధర్మం చేసే యుగాన్ని కృతయుగం అంటారు. ఇక్కడ నాలుగు పాదాల ధర్మం ఉంటుంది. ఒక్క పాదం ధర్మం ఉండదు. ద్వాపర యుగంలో ధర్మం రెండు పాదాల మీద నడుస్తుంది. మిగిలిన రెండు పాదాలు అధర్మం అన్నమాట. ప్రస్తుత కలియుగం విషయానికి వస్తే, ఒకరికొకరు పడని కాలం పేరే కలియుగం. కలియుగం పూర్వపు యుగాలలో కలిసి ఉండడానికి కారణాలు వెదికేవారు. కలియుగంలో విడిపోవడానికి కారణాలు వెతుకుతూ ఉంటారు. ఈ నాలుగు యుగాలూ మనలోనే ఎప్పుడైనా సాధించవచ్చనే విషయాన్ని మహాభారతంలో హనుమంతుడు భీముడికి వివరంగా చెప్పాడు. అవన్నీ అలా ఉండి ఇప్పటి సంగతికి వద్దాం. నాలుగు రకాల ధర్మాలను రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు అనుసరించి చూపించినా ఈనాటి ప్రజలు ఏ మేరకు వాటిని అనుసరిస్తున్నారు అని ప్రశ్నించుకుంటే దానికి తగిన జవాబు రాదు.

రామాయణం మీద ప్రసంగించడానికి ఒకాయన వెళ్తున్నారు. "ఎక్కడకు వెళ్తున్నారండీ?" అని అడిగింది ఆయన భార్య. "రామాయణం మీద ఉపన్యసించడానికి" అని,

"నువ్వూ రావచ్చుగా!" అని అడిగారు.

"నేను రానండీ.. మీరు వెళ్లిరండి" అంది భార్య.

"అదేమిటే అలా అంటున్నావు.. రాముడు అడవికి పోతున్నానని చెప్పడంతోనే సీత తాను అడవికి వస్తానని బయలుదేరింది కదా" అన్నారు.

అప్పుడు ఆయన భార్య "సీతేమీ ఉత్తినే బయలుదేరలేదండీ.. ఇంట్లో వయస్సు మళ్లిన మామగారు, అత్తగార్లు ఉన్నారు. అలాగే ఇతరులు. వారందరికీ వంట చేసి పెట్టడం, అలాగే మరిన్ని పనులు.. పెద్దవాళ్లను కంటికి రెప్పలా చూసుకుంటూ ఉండటం.. రోజూ చెయ్యవలసిన పనులు.. అన్ని పనుల భారమూ తన మీదే పడుతుందని ఆలోచించి, వాటి నుంచి తప్పించుకోవడానికే సీత 'తానూ వస్తానని' రాముడితో అడవికి బయలుదేరింది. అంతే తప్ప పతిభక్తి" కాదండీ" అంది భార్య.

ఇంకేం మాట్లాడుతాడు ఆ ఉపన్యాసకుడు? ✦

షేక్ అబ్దుల్ హాకీం జాని


ఆసియాలో అద్భుతమైన అనేక బౌద్ధ ఆలయాలు ఉన్నాయి. కనువిందు చేసే శిల్పకళతో అలరారుతూ ప్రపంచ ప్రసిద్ధి చెందిన కొన్ని బౌద్ధ ఆలయాలు పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వీటిలో పలు ఆలయాలను ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా యునెస్కో గుర్తించడం విశేషం.

# అద్భుత బౌద్ధ ఆలయాలు

## బోరోబుదూర్ ఆలయం

ఆగ్నేయ ఆసియా ఇండోనేషియాలోని సెంట్రల్ జావాలో అద్భుతమైన బోరోబుదూర్ దేవాలయం ఉంది. దీన్నే బారోబుదూర్ అని కూడా పిలుస్తారు. అంటే 'ఎందరో బుద్ధులు' అని అర్థం. ఆలయ సముదాయం ప్రపంచంలోని అత్యంత ఆకర్షణీయమైన మత పరమైన నిర్మాణాలలో ఒకటి. ఇది ఇండోనేషియాలోని మధ్య జావా మాగేలాంగ్‌లో గల మహాయాన బౌద్ధుల పుణ్యక్షేత్రం. ఐకానిక్ బౌద్ధ స్మారక చిహ్నంగా ఈ నిర్మాణం విరాజిల్లుతోంది. ఈ పురాతన కట్టడాన్ని క్రీ.శ.780-840 మధ్య కాలంలో శైలేంద్ర రాజవంశ పాలనా కాలంలోనే లోయలో నిర్మించారు. ఈ వంశంవారు దాదాపు అయిదు శతాబ్దాల పాటు ఈ ప్రాంతాన్ని పాలించారు. ఆ తరువాత దీన్ని 1911, 1983 సంవత్సరాలలో పునరుద్ధరించారు. ఇండోనేషియాలో ప్రాచీన దేవాలయాలను 'కాండి' అని పిలుస్తారు. అందువల్ల స్థానికులు 'బోరోబుదూర్' దేవాలయాన్ని 'కాండీ బోరోబుదూర్' అని పిలుస్తారు.

బోరోబుదూర్ ఆలయ సముదాయం 1991లో యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా మారింది. ఈ పుణ్యక్షేత్ర నిర్మాణంలో ఆరు చతురస్రాకారపు వేదికలపై మూడు వృత్తాకారపు వేదికలు, 2,672 స్తంభాలు, ధ్యాన భంగిమలో ఉన్న 504 బుద్ధ విగ్రహాలు ఉన్నాయి. దీనిలోని ప్రధాన గుమ్మటాన్ని మధ్య వేదికలలోని పై భాగంలో నిర్మించారు. ఇది స్థూప ఆకృతిలో వుంటుంది. మూడో అంతస్తులోని ఈ నిర్మాణంలో 72 స్థూపాలు, గడియార స్తంభాలు, వాటిలో అనేక బుద్ధ విగ్రహాలను అమర్చారు. 72 స్థూపాలు రంధ్రాలు చేసిన అతి పెద్ద గంటలను పోలి ఉంటాయి. ఈ నిర్మాణమంతా దేవాలయాల సమూహామే. పది వేల మంది కూలీలు అనేక సంవత్సరాలు కష్టపడి తమ దేశంలోని అనేక ప్రాంతాలలోని కొండరాళ్లను సేకరించి తొమ్మిది అంతస్తుల ఈ బౌద్ధ ఆలయాన్ని ఒక మేరు పర్వతంలా నిర్మించారు. విహంగ వీక్షణం చేస్తే ఈ ఆలయ సముదాయం ఒక పిరమిడ్‌లా కనిపిస్తుంది. 1906లో సంభవించిన భూకంపం వల్ల బోరోబుదూర్ ఆలయానికి చాలా నష్టం వాటిల్లింది. చాలా విగ్రహాలు దెబ్బతిన్నాయి. ఆ తరువాత ఇక్కడ విపరీతంగా చెట్లు పెరిగిపోయి చిన్నపాటి అరణ్యం ఏర్పడి కొంత కాలం బోరోబుదూర్ కనుమరుగైంది. ఆ తరువాత




బ్రిటిష్ గవర్నర్ సర్ థామస్ స్టాన్‌ఫోర్డ్ రాఫిల్స్ 1814లో ఈ అరణ్య మార్గం గుండా ప్రయాణిస్తూ గుట్టలను పరిశీలించడంతో కొంతమేరకు వెలుగు చూసింది. 1907-1911 మధ్య కాలంలో డచ్ దేశస్తుడైన థియోడార్ వానవిప్ ఈ బౌద్ధ ఆలయ పునరుద్ధరణ కార్యక్రమాన్ని చేపట్టారు. పాత చిత్రాల ఆధారంగా ఈ ఆలయాన్ని చాలా వరకు బాగు చేయడంతో పర్యాటకులు రావడం ప్రారంభించారు. ఇండోనేషియా నలుమూలల నుండి బౌద్ధులు వెసాక్ డే(బుద్ధ జయంతి)ని జరుపుకోవడానికి ఈ ప్రదేశానికి వస్తుంటారు. ఏప్రిల్ లేదా మే మాసాలలో పౌర్ణమి రోజున ఈ పండుగ జరుగుతుంది.

## ఎమరాల్డ్ బుద్ధా

ఈ బుద్ధ విగ్రహం ఆకుపచ్చగా ఉండటంతో ఎమరాల్డ్ బుద్ధా అని పిలుస్తారు. ఈ విగ్రహం థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లోని గ్రాండ్ ప్యాలెస్‌లోని ఎమరాల్డ్ బుద్ధా ఆలయంలో ఉంది. మరకత మణిగా పిలిచే పచ్చరాయితో ఇక్కడి బుద్ధ విగ్రహాన్ని తయారు చేశారు. ఈ బుద్ధ విగ్రహం 26 అంగుళాల ఎత్తులో ధ్యాన భంగిమలో ఉంటుంది. బుద్ధుడు సర్వసంగ పరిత్యాగి కావడంతో ఆయన విగ్రహానికి ఎక్కడా ఆభరణాలు కనిపించవు. అయితే బ్యాంకాక్‌లోని ఎమరాల్డ్ బుద్ధ విగ్రహానికి బంగారు ఆభరణాలు అలంకరించడం విశేషం. ఈ విగ్రహానికి బంగారు ఆభరణాలు అలంకరించడంతో ద్విగుణీకృత అందాలతో కనువిందు చేస్తుంది. బుద్ధుని భక్తుడైన ఒకటవ దామా మహారాజు 1784లో ఈ విగ్రహాన్ని చక్రి వంశస్తుల పుణ్యస్థలంగా పేర్కొని అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి ఎంతో విలువైన కానుకలు సమర్పించాడు. భోమిబాల్ రాజు ఏడాదికి మూడు సార్లు ఎమరాల్డ్ బుద్ధుణ్ణి విధిగా సందర్శిస్తాడు. ఆ సమయంలో ఈ విగ్రహాన్ని బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు.

గ్రాండ్ ప్యాలెస్ మానవ నిర్మిత ద్వీపం. ఈ ప్రాంతాన్ని బౌద్ధ ఆలయాలు, బహుళ అంతస్తుల భవనాలు, రాజ మందిరాలు, ఉద్యానవనాలు, ఎమరాల్డ్ బుద్ధా ఆలయం, ఔటర్‌కోర్ట్, మిడిల్ కోర్ట్, ఇన్నర్ కోర్ట్, మ్యూజియం ... ఇలా విభజించారు.

గ్రాండ్ ప్యాలెస్ 1782మే 6న చక్రి రాజవంశం స్థాపకుడైన ఒకటవ దామా రాజు కాలంలో ప్రారంభించారు. నాటి నుండి గ్రాండ్ ప్యాలెస్ థాయ్‌లాండ్ రాజుల అధికారిక నివాసంగా ఉంది. 1925 తరువాత రాచ కుటుంబాలు ఇక్కడ నివసించడం లేదు.



## పొటాలా ప్యాలెస్

ప్రపంచ పైకప్పుగా విరాజిల్లుతోంది టిబెట్. ఇది చైనాలో అంతర్భాగం అని చెప్పవచ్చు. దీని ప్రాచీన నామం బోయిల్. 7వ శతాబ్దంలో నిర్మితమైన ఈ ప్యాలెస్‌ను నాటి నుండి టిబెటన్‌ల ఆధ్యాత్మిక గురువైన దలైలామా శీతాకాలం ప్యాలెస్‌గా చెబుతారు. అందుకే దీన్ని దలైలామా భవంతి అని పిలుస్తారు. గంభీరమైన తొమ్మిదంతస్తుల ఈ పొటాలా ప్యాలెస్‌ను 1400 కిటికీలతో అద్భుతంగా నిర్మించారు. ఇక్కడ నిరంతరం వెయ్యి మందికి పైగా బౌద్ధ సన్యాసులు ఆధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేస్తుంటారు. బాహ్య ప్రపంచ ప్రభావం ఇక్కడ చొరబడలేదు. 7వ శతాబ్దంలో ఇక్కడ బౌద్ధ మతాన్ని పరిచయం చేసిన రాజు క్రాంపో. ఇక్కడి మతాన్ని లామాయిజం అని పిలుస్తారు. ఇది మార్మిక మతం, బౌద్ధ మతాల సమ్మేళనం. దైవం రాజు రూపంలో జన్మిస్తాడని ఇక్కడివారి విశ్వాసం. అతని పేరు దలైలామా అని ఇక్కడివారు బలంగా నమ్ముతారు. సముద్ర మట్టానికి 3,700 మీటర్ల ఎత్తులో ఉండే ఈ ప్యాలెస్‌ను దేవతల కేంద్ర స్థానంగా భావించి యాత్రికులు ఎంతో శారీరక శ్రమతో దీన్ని చేరతారు. 1957లో చైనా దీన్ని ఆక్రమించుకున్న తరువాత ఈ ప్యాలెస్‌ను చూడటానికి అనుమతి నిరాకరించారు. యునెస్కోవారు 1994లో దీన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు.

పొటాలా ప్యాలెస్ ప్రస్తుతమున్న ప్రాంగణంలో 17వ శతాబ్దంలో సాంగ్ స్టెన్ గంపా అనే మహారాజు ఒక ధ్యాన మందిరాన్ని నిర్మించాడు. ఐదవ దలైలామా తన శీతాకాల నివాసాన్ని ఇక్కడ నిర్మింపజేశాడు. 1949 నుండి 1959 వరకు ఇది దలైలామాల శీతాకాలపు ప్యాలెస్‌గా ఉంది. అనంతరం ఈ భవనం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నెలవుగా, ఓ పవిత్ర మందిరంగా మారింది. కొన్ని గదుల్లో ప్రభుత్వ కార్యాలయాలు, మరికొన్ని గదులలో బౌద్ధ సన్యాసుల ఆవాసాలు ఉన్నాయి. ఇక్కడే బౌద్ధ ఆలయాలు, బుద్ధుని విగ్రహాలు, 700 వరకు కుడ్యచిత్రాలు, వేలాది పెయింటింగ్‌లు, పచ్చబంగారం, వెండితో కూడిన వస్తువులు, తివాచీలు, కర్టెన్లు, పింగాణీ వస్తువులు సందర్శకులు కనువిందు చేస్తున్నాయి. ఇక్కడే పవిత్ర జోభాంగ్ విగ్రహం, స్ట్రాంగ్‌స్టన్ కాంపో విగ్రహం ఉన్నాయి. దలైలామా వేసవి ప్యాలెస్‌ను పొటాలా ప్యాలెస్‌కు పశ్చిమాన 2 కి.మీ. దూరాన లాసా నది ఒడ్డున నిర్మించారు. నాటి నుండి నేటి వరకు టిబెట్ వాసులు ఈ ప్రాంతాన్ని అత్యున్నతమైన పవిత్ర స్థలంగా భావిస్తున్నారు.

## మౌంట్ ఏమీ



మౌంట్ ఏమీ చైనాలోని సుచివాన్ ప్రాంతంలో నెలకొని ఉన్న నాలుగు పవిత్ర బౌద్ధ పర్వతాలు. వీటి ఎత్తు 3,099 మీటర్లు. వీటికి పశ్చిమాన ఉన్న పర్వతాలను డాక్సియాంగ్లింగ్ అంటారు. చైనాలోని తొలి బౌద్ధారామాలు ఇక్కడ ఉన్నాయి. క్రీ.శ. మొదటి శతాబ్దంలో నిర్మించిన అనేక బౌద్ధ ఆలయాలతో నిండిన పర్వతంగా ఖ్యాతినార్జించింది. ఇప్పుడు వంద బౌద్ధ ఆలయాలతో విరాజిల్లుతూ యాత్రికుల్ని విశేషంగా ఆకర్షిస్తోంది. చైనీయులు తమ ప్రార్థనలను స్వర్గానికి పంపడానికి ఈ పర్వతాల వద్ద గంధాన్ని దహనం చేస్తారు. ఏమీ పర్వతం అనే పేరుతో ఇక్కడివారు దీన్ని పిలుస్తారు. 1996లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశంగా దీన్ని గుర్తించారు.

మౌంట్ ఏమీ ప్రాంతంలో 3,200 రకాల చెట్లు, 23 రకాల జంతువుల ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడ లోయలు, జలపాతాలు, కొండలు, నదులు, అరణ్యాలు, వనాలు, కూరగాయల తోటలు కనువిందు చేస్తాయి. క్రీ.శ.713లో హైటాంగ్ అనే బౌద్ధ భిక్షువు లింగ్యాన్ పర్వతంపై అతి పెద్ద బౌద్ధ విగ్రహాన్ని శిల్పీకరించినట్లు చెబుతుంటారు. 71 మీటర్ల ఈ విగ్రహం పర్వతం చివరి వరకు ఉంటే పాదాలు నీటిలో ఉంటాయి. బౌద్ధులు దీన్ని అత్యంత పవిత్రమైన ఆధ్యాత్మిక స్థలంగా భావిస్తారు.

## సియోక్‌గురామ్ గ్రోట్టో

సియోక్‌గురామ్ గ్రోట్టో అనేది దక్షిణ కొరియా జియోంగ్‌జులోని బుల్గుక్సా ఆలయ సముదాయంలో నెలకొని ఉంది. ఈ ఆలయ సముదాయాలు సముద్ర మట్టానికి 750 మీటర్ల ఎత్తులో పర్వతంపై కనువిందు చేస్తున్నాయి. ఈ పర్వతాల మధ్య దూరం 3 కి.మీ. ఉంటుంది. సియోక్‌గురామ్ గ్రోట్టో బౌద్ధ ఆలయాన్ని 1995లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. అత్యుత్తమ బౌద్ధ శిల్పకళకు సియోక్‌గురామ్ గ్రోట్టో నిలయమని చెప్పవచ్చు. కొండపై ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలోని ఎత్తయిన పీఠంపై అతి పెద్ద బంగారు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

కిమ్ డిసోంగ్ ఇక్కడ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది. ఈ ఆలయాన్ని తొలుత సియోక్‌బుల్సా అని, ఆ తరువాత స్టోన్ బుద్ధా టెంపుల్ అని పిలిచారు. క్రీ.శ.742-751 మధ్య కాలంలో సిల్లా రాజ వంశస్తుల కాలంలో దీని నిర్మాణం ప్రారంభమైనట్లు చరిత్ర చెబుతుంది. ఈ ఆలయంలో ధ్యాన ముద్రలో పీఠంపై కూర్చుని ఉన్న అతి పెద్ద గౌతమ బుద్ధుని రాతి విగ్రహాలు ఉన్నాయి. ఆలయ గోడలపై అద్భుతమైన రాతి శిల్పాలు చెక్కారు. అతి పెద్ద బౌద్ధ స్థూపాలు కూడా ఇక్కడ ఉన్నాయి. వజ్రపాణి చిత్రాలు సైతం ఇక్కడ చూడవచ్చు. ●

# కైవల్యమిచ్చే కార్తికం

డా॥ దేవులపల్లి పద్మజ

కార్తిక మాసానికి సమానమైన మాసం లేదు, సత్యయుగంతో సమానమైన యుగమేదీ లేదు, వేదాలతో సమానమైన శాస్త్రమేదీ లేదు, గంగానది వంటి పవిత్రమైన నది మరొకటి లేదు.

**న కార్తికసమో మాసో న కృతేన సమయం యుగమ్ ।**

**న వేద సదృశం శాస్త్రం న తీర్థం గంగయా సమమ్ ॥**

కృత్తికా నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించటం వల్ల ఈ మాసానికి కార్తిక మాసమని పేర వచ్చింది. ప్రతి ఏటా దీపావళి వెళ్లిన మర్నాటి నుంచి కార్తిక మాసం ప్రారంభం అవుతుంది. వెన్నెల శోభలతో అలరారే శరత్ ఋతువులో వచ్చే రెండవ నెల కార్తిక మాసం.

పూర్వం నైమిశారణ్య ఆశ్రమంలో శౌనకాది మహామునులకు సూతక మహాముని కార్తిక మాస వ్రత వైభవాన్ని వివరించినట్లు మనకు పురాణాల ద్వారా తెలుస్తోంది. కార్తిక మాసం మానవునకు ఇహమునకు ఈతిబాధలు తొలగించి పరమును మోక్షము కలిగిస్తుందని తెలియచేస్తాడు. ఈ మాసంలో వనంలో బంధువులు, స్నేహితులతో కలిసి శివ కేశవులను, ఉసిరిచెట్టును పూజించి, సాత్విక ఆహారంలో వనభోజనాలు చేయడం శ్రేయస్కరం.

శ్రీ మహావిష్ణువు పాలకడలిలో ఆదిశేషుని పాన్పు పైన ఆషాఢ శుద్ధ ఏకాదశినాడు తన యోగ నిద్రను ప్రారంభించి తిరిగి కార్తిక శుద్ధ ఏకాదశినాడు కనులు తెరచి యోగనిద్ర నుండి మేల్కొనటం జరుగుతుంది. అందువల్ల కార్తిక శుద్ధ ఏకాదశిని ఉత్థాన ఏకాదశి అని వ్యవహరిస్తారు. ఈ ఏకాదశిరోజు ఎంతో పవిత్రమైనది. ఈ రోజున విష్ణువునకు ప్రీతికరమైన విష్ణు సహస్ర నామ పారాయణం, గోవింద నామ సంకీర్తన చేయాలి.

ఈ మాసంలో శుద్ధ ద్వాదశినాడు శ్రీ మహాలక్ష్మి సమేతుడైన శ్రీ మహావిష్ణువు తులసీ ధాత్రివనంలో ఉంటాడని చెప్తారు. ఈ ద్వాదశిని 'క్షీరాబ్ధి ద్వాదశి' అంటారు. అంటే పూర్వం కృత యుగంలో దేవదానవులు పాలసముద్ర మథనం చేసిన రోజు. కనుక దీనికి క్షీరాబ్ధి ద్వాదశి అని పేరు వచ్చింది. పాల సముద్రాన్ని చిలికారు కనుక చిల్కు ద్వాదశి అని కూడా అంటారు. విష్ణువు దామోదర నామంతో పిలవబడతాడు. తులసి చెంత హరిపూజ పుణ్యప్రదం. నిత్యం క్షీర సముద్రంలో శయనించే శ్రీమహావిష్ణువు ఈరోజు దేవతలతో కలిసి బృందావనానికి వస్తారు. ఈరోజు విష్ణువును పూజిస్తే మహాపాతకాలన్నీ నశించిపోతాయి. బృందావన సన్నిధిలో దీపదాన ఫలితం చెప్పనలవి కాదు.

ఈ మాసంలో మధ్య రోజైన పౌర్ణమి అత్యంత శుభప్రదమైంది. కార్తిక పూర్ణిమనాడు శంకరుడు త్రిపురాసురుణ్ణి వధించిన రోజు. అందువల్ల ఈ రోజును త్రిపుర పూర్ణిమ అని కూడా పిలుస్తారు. కార్తిక మాసం నెల రోజులు చేసే పూజలన్నింటి కంటే కార్తిక పౌర్ణమి నాడు చేసే పూజకు ఫలితం అధికంగా వుంటుంది. కార్తిక పౌర్ణమిని అరుదైన పర్వదినంగా పేర్కొనవచ్చు. ఈరోజు శివాలయంలో ఈశ్వరునికి నవరసాలతో, పంచామృతాలతో మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. ఎండుగడ్డితో తాడును తయారు చేసి ఆలయం ముంగిట తోరణంగా అమర్చి దానిని ఆవునేతి దీపంతో వెలిగిస్తారు. పార్వతీ పర్వమేశ్వరులను పల్లకిలో నుంచి ఈ తోరణం నుండి మూడు సార్లు ఊరేగిస్తారు. ఆ పల్లకిని అనుసరించి భక్తులందరూ ముక్తకంఠంతో శివనామ జపం చేస్తూ ప్రదక్షిణలు చేస్తారు. పౌర్ణమి రోజున అరుణాచల క్షేత్రంలో అఖండ జ్యోతి వెలిగిస్తారు. కార్తిక దీపంగా పిలవబడే ఈ జ్యోతి దర్శనానికి అనేక రాష్ట్రాల నుండి భక్తులు వస్తారు.

దేవతలలో ప్రథముడైన అగ్ని నక్షత్రాలలో మొదటిదైన కృత్తిక అధిపతిగా ఉండటం, చంద్రుడు పూర్ణుడై ఈ నక్షత్రం మీద ఉండటం వల్ల మాసంలోని సోమవారాలకు విశిష్టత కలిగింది. చంద్రుని వారమైన ఈ సోమవారం శివునికి ఎంతో ప్రీతికరమైంది. శైవభక్తులు ఈ మాసంలో ముఖ్యంగా సోమవారాలలో భక్తిశ్రద్ధలు, నియమనిష్టలతో శివుణ్ణి ఆరాధిస్తారు. ఉపవాసం, ఏకభుక్తం, నక్తం, అయాచితం, స్నానం, తిలదానం అని సోమవారం వ్రత విధి ఆరు రకాలు.

ఈ మాసంలో శివార్చన చేసిన వారికి గ్రహ దోషాలు, ఈతిబాధలు ఉండవు. శివాలయంలో ప్రార్థన, లింగార్చన, బిల్వార్చన వంటి పుణ్య కార్యాలు ఆచరించటం మంచిది. ఏక భుక్తం లేక కొన్ని విశేష రోజుల్లో ఉపవాసాలు, నిత్యం తులసి దగ్గర దీప ప్రజ్వలన, యథాశక్తి దాన ధర్మాలు, దీపదానం మొదలైనవి అత్యంత శుభప్రదాలు. ఈ మాసం వివిధ వ్రతాలకు శుభ ప్రదమైంది. కార్తిక పురాణ పఠనం ఎంతో ప్రసిద్ధి చెందింది. రోజుకొక్క అధ్యాయం పఠించి, దానిలోని ఆంతర్యాన్ని గ్రహించి ఆచరించిన వారి జన్మ ధన్యమవుతుంది. వనభోజన ప్రాశస్త్యం, అర్చన విధి విధానాలు, ఎందరో భక్తుల జీవిత గాథలు, నదీ స్నాన విశేషాలు మానవులకు మార్గనిర్దేశనం చేస్తాయి.



మన హిందూ పండుగలలో, ఉత్సవాలలో ఆధ్యాత్మిక తత్వంతో పాటు లోక కళ్యాణం, ప్రకృతి పరిరక్షణ వంటి విజ్ఞాన విషయాలు కూడా దాగి వుంటాయి. ఈ నెల రోజులు హరిహరులకు విశేషార్చనలు చేసి భక్తులు తరిస్తారు. 'హరిః ఓం నమస్తే అస్తు భగవన్విశ్వేశ్వరాయ మహాదేవాయ త్ర్యంబకాయ త్రిపురాంతకాయ త్రికాలాగ్ని కాలాయ కాలాగ్ని రుద్రాయ నీలకంఠాయ మృత్యుంజయాయ సర్వేశ్వరాయ సదాశివాయ శ్రీమన్మహాదేవాయ నమః" అనే రుద్ర నమకం మంత్ర భాగం ప్రతిధ్వనిస్తూ ఉంటుంది. శివాలయాలు, జ్యోతిర్లింగ క్షేత్రాలు భక్తులతో నిండిపోతాయి. అత్యంత ఫలప్రదమైన ఈ కార్తిక మాసాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించి మన సంప్రదాయ విధివిధానాలను ముందు తరాలకు పదిలపరచి లోక క్షేమానికి కృషి చేద్దాం. •



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



ఉన్నత విద్యను అభ్యసించాలనే మీ కోరిక నెరవేరుతుంది. దూరదృష్టితో వ్యవహరిస్తారు. నిదానంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు. తొందరపాటుకు ఏమాత్రం అవకాశం కల్పించరు. లౌక్యంగా వ్యవహరిస్తారు. కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన అంశాలు లాభిస్తాయి. రుణాల నుండి విముక్తి పొందడానికి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తారు.

## వృషభం



వివాదాస్పద అంశాలకు దూరంగా ఉండటం చెప్పదగిన సూచన. ఆర్థిక స్థితి అనుకూలంగా ఉంటుంది. నిక్కచ్చిగా వ్యవహరిస్తారు. నిబద్ధత లేని కొన్ని స్కీముల వల్ల నష్టపోయే సూచనలున్నాయి. అతిముఖ్యమని భావించే వ్యవహారాలు ఎన్ని మలుపులు తిరిగినా చివరకు మీరు అనుకున్నదే అవుతుంది. కాకతాళీయ పరిచయాలు లాభసాటిగా పరిణమిస్తాయి.

## మిథునం



సాహిత్య కళా రంగాల పట్ల అభిరుచి కనబరుస్తారు. ఏమాత్రం ఉపయుక్తం లేని అంశాలు ప్రాధాన్యం సంతరించుకుంటాయి. మీ మీద వచ్చిన ఆరోపణలకు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి. గుడ్ విల్‌ను రుజువు చేసుకోగలుగుతారు. విందు, వినోదాల ద్వారా పరిచయాలు విస్తృతమవుతాయి. ఉమ్మడి కొనుగోళ్లు లాభించవు.

## కర్కాటం



వృత్తి, ఉద్యోగాల పరంగా అభివృద్ధి గోచరిస్తోంది. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు పరంగా రావలసిన పెండింగ్ బిల్స్ ఓ కొలిక్కి వస్తాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుంది. వ్యాపార పరంగా తీసుకోవలసిన నిర్ణయాలను వ్యూహాత్మకంగా అమలు చేస్తారు. ఆత్మీయులతో విభేదాలు వచ్చే అవకాశం ఉంది.

## సింహం



ఆర్థిక వ్యవహారాలు మినహా మిగతా విషయాలు అనుకూలం. ఉన్నతాధికారులతో జరిపే చర్చల వల్ల లాభపడతారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న విషయాలను ఓ కొలిక్కి తీసుకువస్తారు. ప్రభుత్వ పరమైన లీజులు, లైసెన్సులు సాధించడానికి చేసే ప్రయత్నాల్లో సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. విలువైన రహస్య సమాచారం తెలుసుకుంటారు.

## కన్య



లీజులు, లైసెన్సులు తిరిగి పొందడానికి మీరు చేసే ప్రయత్నాలు అనుకూలిస్తాయి. రాజకీయ పరమైన వ్యవహారాలు సానుకూలం. వ్యాపార పరంగా స్వల్ప అభివృద్ధిని సాధిస్తారు. న్యాయబద్ధమైన మీ వాదనలకు పదుగురి మద్దతు లభిస్తుంది. ప్రజా సంబంధాలను మరింత మెరుగు పరచుకుంటారు. లిటిగేషన్ వ్యవహారాలు సానుకూలపడతాయి.

## తుల



సానుకూల ఫలితాలు సాధిస్తారు. అధికారులతో ముఖాముఖి చర్చలు సాగిస్తారు. నూతనమైన బ్యాంక్ ఖాతాలు ప్రారంభిస్తారు. ప్రయోజనాలను సాధించుకోవడానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. అనాథాశ్రమాలను సందర్శిస్తారు. అపనిందలకు భయపడకుండా మీరు చేయదలచుకున్న పనులు నిర్విఘ్నంగా పూర్తి చేస్తారు. కరస్పాండెన్స్, రాజకీయాలు, విదేశీయాన విషయాలు అనుకూలంగా వుంటాయి.

## వృశ్చికం



మీరు అనుకున్న విధంగా ప్రణాళికలను అమలు పరచడానికి గ్రహస్థితి అనుకూలంగా లేదు. పంచాయితీలు, మధ్యవర్తి పరిష్కారాలు, కోర్టు వ్యవహారాలు కాలహరణానికి కారణం అవుతాయి. ఆదాయ, వ్యయాలు సరి సమానంగా టాయి. కీలకమైన వ్యవహారాలలో నిదానించడం చెప్పదగినది. మానసిక వత్తిడిని తగ్గించుకోవడానికి వినోద కార్యక్రమాల పట్ల ఆసక్తి కనబరుస్తారు. నూతన అగ్రిమెంట్లు చేసుకుంటారు.

## ధనుస్సు



ఈ వారం ప్రథమార్థం కన్నా ద్వితీయార్థం అనుకూలంగా ఉంటుంది. రహస్య చర్చల్లో కొత్తవారికి చోటు కల్పించకండి. ఆర్థిక పరమైన విషయాలలో మెళకువలు వహించండి. రొటీన్ సంతకాల విషయంలో జాగ్రత్తలు అవసరం. కుటుంబ వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. అనుకూలమైన ఉత్తర్వుల వలన ప్రత్యక్షంగా/పరోక్షంగా గానీ లాభపడతారు. సాంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తారు.

## మకరం



మీ పరపతి పెరుగుతుంది. స్వర్ణాభరణాలు కొనుగోలు చేస్తారు. శ్రమ అధికంగా ఉన్నప్పటికీ ఫలితాలు మెరుగ్గా ఉంటాయి స్థిరాస్తి విషయంలో ఏర్పడిన విభేదాలు తొలగిపోతాయి. మీ సలహాలను పాటించేవారు ఎక్కువగా ఉంటారు. విదేశీ సంబంధమైన విషయాలు విజయవంతమవు తాయి. పెట్టుబడుల విషయంలో స్పష్టత ఏర్పడుతుంది. ప్రచా రంలో వున్న నిందలను రూపుమాపుకోవడానికి శ్రీకారం చుడతారు.

## కుంభం



ఆర్థికంగా చెప్పుకోదగిన ఒడుదుడుకులేమీ ఏర్పడవు. ఉపయుక్తమైన ఖర్చులు ఉంటాయి. క్షుద్ర రాజకీయాలను అధిగమిస్తారు. శత్రు వర్గానికి బుద్ధి చెబుతారు. మీ కృషికి తగిన కీర్తి లభిస్తుంది. బదిలీ/ప్రమోషన్ విషయంలో సాంకేతిక పరమైన లోపాలు చోటు చేసుకుంటాయి. నిర్మాణాత్మక వ్యవహారాలలో పురోభివృద్ధి ఆశించిన స్థాయిలో ఉంటుంది.

## మీనం



స్థిరత్వం, ధైర్యం వలన అనుకూల ఫలితాలను సాధిస్తారు. మీ ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. వివాదాస్పద అంశాలను పరిష్కరించుకుంటారు. ఆర్థిక ప్రయోజనాలను సాధించుకోవడానికి మీరు చేసే నూతన యత్నాలు ఫలిస్తాయి. మీ అంచనాలు నిజమవుతాయి. క్రమశిక్షణ లోపించకుండా జాగ్రత్తలు వహించండి. మనస్సు విశ్రాంతి కోరుకుంటుంది, అయితే అందుకు పరిస్థితులు అనుకూలించవు.

# వృథా నీరు ఎటు వైపు?


**వాస్తువార్త**

**వాస్తు విద్వాన్ సాయిశ్రీ**

**డా॥ దంతూరి పండరినాథ్**

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




### కంచం కడిగిన నీళ్లు-ఉత్తరం

కంచం కడిగిన నీరు ఉత్తర దిక్కున చల్లిన ధనధాన్యాలు లభిస్తాయి. కిచెన్‌లో, డైనింగ్‌లో, ఇంటి ఆవరణలో వాష్‌బేసినలు, అంట్లు కడిగే ప్రదేశాలు ఉత్తరాన ఏర్పాటు చేసుకున్నట్లయితే ఈ చర్యలు సహజంగానే జరిగి, ఆ ఇంటిని ధనధాన్యప్రదం చేస్తాయి.

### Crockery washing water-North

After washing crockery and cutlery, if the residual water from the sink flows towards North the effect of this would make a person amass a lot or wealth, fortune or at times tends to make him wealthy. In the position of the sink in the kitchen and the wash basin the dining hall is facing towards North, such an arrangement would involuntarily bring luck and prosperity.

### కంచం కడిగిన నీళ్లు-వాయవ్యం

ఇంట్లో కంచం కడిగిన నీరు వాయవ్య దిక్కున చల్లినట్లయితే శత్రుత్వం పెరుగుతుంది. కిచెన్‌లోను, డైనింగ్ హాల్స్‌లో, ఇంటి ఆవరణలోను వాష్‌బేసిన్‌లు అంట్లు కడిగే ప్రదేశాలు వాయవ్యంలో ఉన్నట్లయితే సహజంగా జరిగే ఈ(అకారణ) శత్రుత్వం, కలహాలతో కలత చెందవలసి వస్తుంది.

### Crockery washing water-North-West

After washing crockery and cutlery, if the residual water from the sink flows towards North-West, the effect of this would result in attracting enmity and quarrels. In the position of the sink in the kitchen and the wash basin the dining hall is facing towards North-West, such an arrangement would involuntarily create obstacles and feeling of hostility.

### కంచం కడిగిన నీరు-పశ్చిమం

ఇంటిలో కంచం కడిగిన నీరు పశ్చిమ దిశలో చల్లినట్లయితే అజీర్ణ బాధలు సంభవిస్తాయి. కిచెన్‌లో, డైనింగ్ హాల్స్‌లో, ఆంటి ఆవరణంలో పశ్చిమాన వాష్‌బేసిన్లు, అంట్లు కడిగే ప్రదేశాల ఏర్పాటు ఉన్నట్లయితే సహజంగా జరిగే ఈ దోషం వలన అజీర్ణ బాధలు పొందవలసిన పరిస్థితి వస్తూ ఉంటుంది.

### Crockery washing water-West

After washing crockery and cutlery, if the residual water



from the sink flows towards West the effect of this will lead to indigestion problems. In the position of the sink in the kitchen and the wash basin the dining hall is facing towards West, such an arrangement would lead to this type of problems.

### కంచం కడిగిన నీళ్లు-నైఋతి

ఇంటిలో కంచం కడిగిన నీరు నైఋతి దిక్కులో చల్లినట్లయితే రోగబాధలు కలుగుతాయి. కిచెన్‌లోను, డైనింగ్ హాల్స్‌లోను, ఇంటి ఆవరణలోను వాష్‌బేసిన్‌లు, అంట్లు కడిగే ప్రదేశాలు నైఋతి దిక్కున ఉన్నట్లయితే సహజంగా జరిగే ఈ చర్య వలన రోగబాధలు అనుభవించవలసి వస్తుంది.

### Crockery washing water-South-West

After washing crockery and cutlery, if the residual water from the sink flows towards South-West the effect of this will lead to ill health. In the position of the sink in the kitchen and the wash basin the dining hall is facing towards South-West, such an arrangement would lead to ill health problems.

### కంచం కడిగిన నీరు-దక్షిణం

ఇంటిలో కంచం కడిగిన నీళ్ల దక్షిణ దిశలో చల్లినట్లయితే మృత్యుభయం కలగవచ్చు. కిచెన్‌లోను, డైనింగ్ హాల్స్‌లోను, ఇంటి ఆవరణలోను వాష్‌బేసిన్లు, అంట్లు కడిగే ప్రదేశాలు, దక్షిణ దిక్కున ఉన్నట్లయితే ఈ చర్య సహజంగా జరిగి మృత్యుభయం అనుభవించవలసి వస్తుంది.

### Crockery washing water-South


After washing crockery and cutlery, if the residual water from the sink flows towards South the effect of this would cause fear of death. In the position of the sink in the kitchen and the wash basin the dining hall is facing towards South, such an arrangement would create that type of fears.

### కంచం కడిగిన నీరు-తూర్పు

ఇంటిలో కంచం కడిగిన నీరు తూర్పుకు చల్లినట్లయితే శుభం. కిచెన్‌లో, డైనింగ్ హాల్‌లో వాష్‌బేసిన్‌లు తూర్పు దిక్కున పెట్టుకోవటం వలన ఈ చర్యలు సహజంగానే జరిగి మంచి ఫలితాలు లభిస్తాయి. ఇంటి ఆవరణలో అంట్లగిన్నెలు కడిగే ప్రదేశం తూర్పున ఏర్పాటు చేసుకోవడం వల్ల శుభాలనిస్తాయి.

# పదరంగం-15

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. ఎన్నికల ముందు నాయకులు చేసేవి, హామీలు (4)
4. సిపాయిల దళం (3)
6. కదుపులో ఉండే ముఖ్యమైన కీలక గ్రంథి (3)
8. పరాకు, మరుపు (5)
9. వేదిక నుండి విస్తారంగా వచించేది సరిగా లేదు (4)
11. ఎద్దులతో సిద్ధంగా ఉన్న నాగలి తిరగబడింది (3)
13. తుప్పు (2)
16. భ్రమరం (3)
17. మెరుగురాయి, కొలబద్ద కూడా (4)
18. ఒక దుంప (2)
21. మొదలు లేని ఒక పాండవుడు (3)
23. తిరగబడినా ఈ నాణెం ఇప్పుడు చెల్లదు (2)
24. వాడుక భాషలో శూర్పణఖ, ఓర్వలేనిది (4)
26. ఆకులకు, పూలకు, కాయలకు ఉండే కాడ (3)
27. ఒక శృంగార నాయిక (6).

### నిలువు

2. నాణ్యత లేనిది (4)
3. పరుగుకి పేరైన జంతువు పైకెగిరింది (2)
5. ఒక ఉత్తరాది పొరల రొట్టె తలకిందులైంది (3)
6. స్త్రీలు కళ్లకు పెట్టుకునేది (3)
7. అధర్మం, మోసం లాంటిది తలకిందులైంది (3)
8. ఒంటరి, అసహాయుడు (3)
10. పత్రికకు తలకాయ వంటివాడు (5)
12. పుండు నుంచి కారే ద్రవం (2)
14. కొందరు మగవారు ఇళ్లలో ధరించేది(2)
15. పనికి మొండికేయు (4)
16. చివరికి (3)
19. పైకొచ్చిన కాశీ (4)
20. ఉంగరపు వేలు (4)
22. కాళ్లకు పెట్టుకునేవి పైకొచ్చాయి (4)
25. వాగు, సాకు(2)

### పదరంగం-13కి జవాబులు పంపించినవారు

1. గుండ్రాతి సుబ్రహ్మణ్యం గౌడు-రాజంపేట
2. సి.ఎస్. మధుకర్-కొత్తపేట

జవాబులు పంపించాల్సిన చిరునామా:

పదరంగం ఆదివారం వార్త, నం.396,

లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ....................................................


....................................................


ఊరు : ....................................................


## పదరంగం-13 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆ 1 | ద | రా 2 | బా | ద | రా 3 | | అ 4 | స 5 | లు |
| కు | | జ్య | | | క 6 | సి 7 | | వా | |
| రా 8 | క్ష | స | బ 9 | ల్లి | | ప | | ల 10 | య |
| యి | | | ట్ట | | వి 11 | యూ | పా 12 | క్ష | |
| | తే 13 | | బ 14 | లు | పు | | ర | | ఆ 15 |
| ఊ 16 | ర | గా | య | | లం 17 | క | కు | చే | టు |
| స | | | లు 18 | లు 19 | | | లు | | కు |
| ర 20 | క | గు 21 | | రా 22 | బ | డి 23 | | మే 24 | లు |
| వె | | ను | | ష్క | | గ | | డా | |
| ల్లి 25 | పి | గు | ను | పు | | అం 26 | త | రం | గం |

# ఈ వారం కా'ర్టూన్స్'


మీరు ప్రచారానికి మా ఊరికి వచ్చినప్పుడు 'బ్రహ్మరథం' పడతాం అనుకుంటున్నాం. అదొక్కటీ కొనివ్వండి..!!
VOTE


అన్నీ ఫ్రీగా అలవాటై ఛీ ముష్టి బతుకు అనిపిస్తోంది.. ఆత్మగౌరవం కావాలి సార్!!


పోస్టల్ బ్యాలెట్లలో కూడా దొంగ ఓట్లు వచ్చాయి సర్!!
RETURNIG OFFICER



స్వీడన్‌లోని అబిస్కో గ్రామానికి చెందిన చిత్రాలివి. ఇక్కడ కాలుష్యం చాలా తక్కువ. నాలుగైదు రోజులు ఈ గ్రామంలో వుంటే వెలుగులు చిమ్మే కాంతులను, అబ్బురపరిచే సీనరీలను చూడవచ్చు. అబిస్కో సందర్శించడానికి అనువైన సమయం సెప్టెంబరు-ఏప్రిల్ మధ్య కాలం. ప్రపంచ పర్యాటకుల లిస్టులో ఈ గ్రామం ఒకటని చెప్పవచ్చు.









